సర్కారు ఆసుపత్రుల్లో రోగుల సంఖ్య పెరుగుతోంది

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగవుతుండడంతో ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం హైదరాబాద్ వెంగళ్‌రావు నగర్‌లోని 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్' కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. "ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మెరుగుపడడంలో సూపరింటెండెంట్ల పాత్ర అత్యంత కీలకం. రోగులు పెట్టుకున్న నమ్మకాన్ని కాపాడుకుంటూ, వారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు, డాక్టర్లు, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది అందరిపైనా ఉంది. సేవల నాణ్యత విషయంలో సూపరింటెండెంట్లు ఎలాంటి సాకులు చెప్పొద్దు. ఏ అవసరం ఉన్నా జిల్లా ఉన్నతాధికారులు, కలెక్టర్, శాఖాధిపతి మొదలుకొని మంత్రి వరకూ అందరికీ సమాచారం చేరవేయాలి. డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సమయపాలన పాటించాలి. ఆసుపత్రుల పనితీరును ఇకపై నిరంతరం సమీక్షిస్తాం. ఇందుకోసం డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నాం" అని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

కేసీఆర్ కుటుంబీకులు నిజాం రాజును మించిన ధనవంతులుగా మారారు

- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి భూమిపూజ
- అందెశ్రీ ఒక ఆత్మబంధువు అని కొనియాడిన సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు
- ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడి
- తాను సీఎంగా ఉండగా బీఆర్ఎస్ అధికారంలోకి రాదని స్పష్టం

హైదరాబాద్ పెన్ పవర్: కేసీఆర్ కుటుంబం వందలాది ఎకరాల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించుకుందని, వారు నిజాం రాజును మించిన ధనవంతులుగా ఎదిగారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విమర్శించారు. ప్రముఖ కవి, గాయకుడు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత అందెశ్రీ గౌరవార్థం ఘట్‌కేసర్‌లో నిర్మించనున్న 'అందెశ్రీ స్మృతివనం' పనులకు ముఖ్యమంత్రి శనివారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "దొరల గడీల ముందు తలవంచను" అని చాటిచెప్పిన ధైర్యశాలి అందెశ్రీ అని ముఖ్యమంత్రి కొనియాడారు. ప్రజల కవిగా, గాయకుడిగా అందెశ్రీ అందించిన సేవలను స్మరించుకుంటూ, ఆయనను తన 'ఆత్మబంధువు'గా అభివర్ణించారు. గత పాలకులు ఆయన వంటి గొప్ప కళాకారులను విస్మరించారని మండిపడ్డారు. ఇదే క్రమంలో, కల్వకుంట్ల కుటుంబంపై రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో నిరుద్యోగ యువతను పట్టించుకోకపోవడంతో వారు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, ఏళ్ల తరబడి గ్రూప్-1 వంటి పరీక్షలు కూడా నిర్వహించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అందుకు భిన్నంగా, తమ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే సుమారు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, అభ్యర్థుల తల్లిదండ్రుల సమక్షంలోనే నియామక పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఫామ్‌హౌస్‌ల నిర్మాణం కోసం కేసీఆర్ కుటుంబం తెలంగాణ సంపదను దోచుకుందని, మళ్లీ ఎవరైనా

- మిగతా 4లో...

బోనాల పండుగ..! తెలంగాణ సంస్కృతికి ప్రతీక..!

- ఆషాఢమాసం బోనాలు.. సంప్రదాయాల సంస్కృతి వైభవాన్ని చాటే మహాసంగమం..
- సీనియర్ జర్నలిస్టు గోగులపాటి కృష్ణమోహన్ ప్రత్యేక వ్యాసం..!

- మిగతా 4లో...

- 1813లో ప్లేగు మహమ్మారి నేపథ్యంలో ఆవిర్భవించిన బోనాల పండుగ..!
- 1815 నుంచి ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఘనంగా కొనసాగుతున్న సంప్రదాయం..!
- కొత్త మట్టి కుండలో వండిన నైవేద్యం.. పసుపు,కుంకుమ,వేపాకులతో అలంకరణ..!
- బోనంపై దీపంతో అలంకరించి అమ్మవారికి పవిత్రంగా 'బోనం' చెల్లిస్తారు..!
- పూనకాల పారవశ్యం.. శివసత్తులు, పోతురాజుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ..!
- పసుపు,వేపాకుల వినియోగం వెనుక ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ప్రజాజ్ఞానం..!
- ప్రకృతి వైద్యానికి సంబంధించిన ప్రజాజ్ఞానం ఇందులో దాగి ఉందని విశ్వాసం..!
- కులమత, పేద--ధనిక భేదాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తెచ్చే ఐక్యత..!

01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసిఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

'4 సెం.మీ 4 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

బూతులు తిడితే అది అశ్లీలత కాదు.. సుప్రీం కోర్టు సంచలన తీర్పు..

హైదరాబాద్ పెన్ పవర్:కోపంలోనో, గొడవల్లోనో వాడే తిట్లు, అసభ్య పదజాలం లేదా బూతులు ఎంత అసహ్యకరంగా ఉన్నప్పటికీ, వాటిని క్రిమినల్ చట్టం ప్రకారం నేరుగా అశ్లీలత కింద పరిగణించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

ఒక మాటను అశ్లీలంగా భావించాలంటే దానికి చట్టపరమైన నిర్దిష్ట ప్రమాణాలు ఉండాలని, అది వినేవారిని లైంగికంగా ప్రేరేపించేలా లేదా దిగజార్చేలా ఉంటేనే ఆ సెక్షన్ వర్తిస్తుందని కోర్టు తెలిపింది. తమిళనాడుకు చెందిన మణి అనే వ్యక్తి దాఖలు చేసిన అప్పీల్‌ను పాక్షికంగా అనుమతిస్తూ జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ విపుల్ ఎమ్. పాంచోలిలతో కూడిన ధర్మాసనం ఈ కీలక తీర్పును వెలువరించింది.

అసలు కేసు ఏమిటి?

2017 ఆగస్టులో తమిళనాడులో జరిగిన ఒక వ్యవసాయ భూమి వివాదంలో మణి అనే వ్యక్తి తన ప్రత్యర్థులను అత్యంత అసభ్య పదజాలంతో దూషించడమే కాకుండా కొడవలితో దాడి చేసి ఒకరి ముక్కు ఎముక విరిగేలా చేశాడు. ఈ కేసులో ట్రయల్ కోర్టు అతనికి ఐపీసీ సెక్షన్ 294(బి) (అశ్లీలత), 326 (తీవ్రమైన గాయం చేయడం), 506(ఐఐ) (క్రిమినల్ బెదిరింపు), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద శిక్ష విధించింది. మద్రాస్ హైకోర్టు ఎస్సీ, ఎస్టీ చట్టం కేసును కొట్టివేసినప్పటికీ.. ఐపీసీ శిక్షలను అలాగే ఉంచడంతో నిందితుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు.

సుప్రీంకోర్టు ఏం చెప్పింది?

ఈ కేసును విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, ఐపీసీ సెక్షన్ 294(బి) కింద అశ్లీలత అనే నేరాన్ని మోపాలంటే కేవలం చెడు మాటలు మాట్లాడితే సరిపోదని స్పష్టం చేసింది. "చట్టప్రకారం అశ్లీలత అనేది కేవలం అసభ్యత లేదా తిట్లకు సమాన అర్థం కాదు. గొడవల సమయంలో వాడే బూతు పదాలు వినడానికి అసహ్యంగా, దిగ్భ్రాంతికరంగా అనిపించవచ్చు. కానీ అవి ఎదుటివారిని మానసికంగా లేదా నైతికంగా దిగజార్చేలా ఉంటేనే అశ్లీలత అవుతుంది.

- మిగతా 4లో...

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు: మంత్రి సురేఖ

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తప్పనిసరి

హైదరాబాద్ పెన్ పవర్: ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ముప్పుగా మారే బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో ఎలాంటి రాజీ ఉండదని అటవీ, పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించే ఆసుపత్రులు, సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ రూల్స్-2016 అమలు, యూజర్ ఛార్జీల పెంపుపై మంత్రి శనివారం

- మిగతా 4లో...

బోనాల పండుగ..! తెలంగాణ సంస్కృతికి ప్రతీక..!

- ఆషాఢమాసం బోనాలు.. సంప్రదాయాల సంస్కృతి వైభవాన్ని చాటే మహాసంగమం..
- సీనియర్ జర్నలిస్టు గోగులపాటి కృష్ణమోహన్ ప్రత్యేక వ్యాసం..!

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జూలై 18: ఆషాఢమాసం ప్రారంభమవగానే తెలంగాణ నేల అంతటా ఒక విలక్షణమైన ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. గ్రామమైనా, నగరమైనా ప్రతి వీధి డప్పుల మోతలతో, వేపాకుల సువాసనలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకుంటుంది. మహంకాళి అమ్మవారు, ఎల్లమ్మ, పోచమ్మ, పెద్దమ్మ, మైసమ్మ వంటి గ్రామదేవతల ఆలయాలు భక్తుల రాకతో సందడిగా మారుతాయి..అయితే బోనాలు కేవలం ఒక ప్రాంతీయ పండుగ మాత్రమే కాదు. శతాబ్దాల చారిత్రక నేపథ్యం, భక్తి పారవశ్యం, జానపద సంప్రదాయాలు, సామాజిక ఐక్యత, మానవతా విలువలు కలగలిసిన అద్భుతమైన సాంస్కృతిక వేడుకగా బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉంది..

ఆషాఢమాస బోనాలు కేవలం ఒక ఆచారం కాదు.. తెలంగాణ అస్తిత్వానికి, స్త్రీశక్తికి, జానపద కళల వైభవానికి, భక్తి సంప్రదాయాలకు, సామాజిక ఐక్యతకు సజీవ సాక్ష్యం.. తరతరాలుగా కొనసాగుతున్న ఈ గొప్ప సాంస్కృతిక సంప్రదాయాన్ని భవిష్యత్ తరాలకు అందించడం మనందరి బాధ్యత. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బోనాల పండుగ భక్తి, సంప్రదాయం, ప్రకృతి, సామాజిక సమరసతల మహాసంగమంగా చిరస్థాయిగా నిలవాలి.

పండుగ వెనుక చారిత్రక నేపథ్యం..!

బోనాల పండుగకు బలమైన చారిత్రక నేపథ్యం ఉంది. 1813లో హైదరాబాద్ నగరంలో ప్లేగు మహమ్మారి తీవ్రంగా ప్రబలడంతో వేలాది మంది ప్రజలు ప్రాణాలు కోల్పోయినట్లు చారిత్రక కథనాలు చెబుతున్నాయి. ఆ సమయంలో ఉజ్జయినికి వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన కొందరు సైనికులు అక్కడి మహంకాళి అమ్మవారిని ప్రార్థిస్తూ, నగరాన్ని ఈ మహమ్మారి నుంచి రక్షిస్తే ప్రతి ఏటా ఘనంగా బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామని మొక్కుకున్నారని చెబుతారు.. అమ్మవారి అనుగ్రహంతో మహమ్మారి తగ్గుముఖం పట్టిందన్న విశ్వాసంతో, 1815 నుంచి లష్కర్ (సికింద్రాబాద్)లోని ఉజ్జయిని మహంకాళి ఆలయంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించడం ప్రారంభమైందని చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. నాటి నుంచి నేటి వరకు ఈ సంప్రదాయం కొనసాగుతోంది.. ప్రకృతి విపత్తులు, అంటువ్యాధుల నుంచి ప్రజలను కాపాడే ఆరోగ్య ప్రదాతగా అమ్మవారిని విశ్వసిస్తూ, కృతజ్ఞతా భావంతో ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా మారింది..

- 1813లో ప్లేగు మహమ్మారి నేపథ్యంలో ఆవిర్భవించిన బోనాల పండుగ..!
- 1815 నుంచి ఉజ్జయిని మహంకాళి ఆలయంలో ఘనంగా కొనసాగుతున్న సంప్రదాయం..!
- కొత్త మట్టి కుండలో వండిన నైవేద్యం.. పసుపు,కుంకుమ,వేపాకులతో అలంకరణ..!
- బోనంపై దీపంతో అలంకరించి అమ్మవారికి పవిత్రంగా 'బోనం' చెల్లిస్తారు..!
- పూనకాల పారవశ్యం.. శివసత్తులు, పోతురాజుల నృత్యాలు ప్రత్యేక ఆకర్షణ..!
- పసుపు,వేపాకుల వినియోగం వెనుక ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ప్రజాజ్ఞానం..!
- ప్రకృతి వైద్యానికి సంబంధించిన ప్రజాజ్ఞానం ఇందులో దాగి ఉందని విశ్వాసం..!
- కులమత, పేద--ధనిక భేదాలకు అతీతంగా ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తెచ్చే ఐక్యత..!

'బోనాన్ని నైవేద్యంగా అమ్మవారికి సమర్పణ..

'బోనం' అంటే భోజనం లేదా నైవేద్యం. కొత్త మట్టి కుండలో బియ్యం, పాలు, బెల్లంతో అన్నం వండి, ఆ కుండకు పసుపు, కుంకుమలు అద్ది, వేపాకులతో అలంకరిస్తారు. అనంతరం కుండపై దీపాన్ని వెలిగించి, మహిళలు భక్తిశ్రద్ధలతో తలపై మోసుకుంటూ ఆలయానికి చేరుకుని అమ్మవారికి సమర్పిస్తారు.. బోనాల సంప్రదాయంలో పసుపు, వేపాకులకు కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. రుతుపవనాల మార్పు సమయంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో, పసుపు, వేప వంటి సహజ వనరుల వినియోగం ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ప్రజాజ్ఞానాన్ని ప్రతిబింబిస్తుందని పలువురు భావిస్తారు.. ఇళ్లను, పరిసరాలను వేపాకులతో అలంకరించడం, పసుపు వినియోగించడం వంటి ఆచారాల వెనుక ప్రకృతి ఆధారిత జీవన విధానానికి సంబంధించిన జ్ఞానం దాగి ఉందని చెప్పవచ్చు.

శివసత్తుల పూనకాల పారవశ్యం..!

బోనాల ఉత్సవాల్లో అత్యంత ఉద్వేగభరితమైన ఘట్టాల్లో 'శివసత్తుల పూనకాలు' ఒకటి.. డప్పుల మోతలు, జానపద వాయిద్యాల నాదం పరాకాష్ఠకు చేరుకున్న సమయంలో శివసత్తులు భక్తి పారవశ్యంలో నృత్యం చేస్తారు.. వారి నృత్యాలు, పూనకాల దృశ్యాలు భక్తుల్లో ఆధ్యాత్మిక భావోద్వేగాన్ని కలిగిస్తాయి. అమ్మవారి సోదరుడిగా భావించే పోతురాజు కూడా బోనాల పండుగలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాడు. వీరనృత్యాలు చేస్తూ, ఊరేగింపులకు ముందుండే పోతురాజు సంప్రదాయం బోనాల ఉత్సవాల్లో ప్రత్యేకమైన జానపద కళారూపంగా కొనసాగుతోంది..

సామాజిక ఐక్యతకు మహా వేదిక ఈ బోనాలు..

బోనాల పండుగ యొక్క అసలైన గొప్పతనం దాని సామాజిక ఐక్యతలోనే ఉంది.. కులమతాలు, పేద--ధనిక భేదాలకు అతీతంగా ప్రజలు ఈ పండుగలో పాల్గొంటారు.. వివిధ వర్గాల ప్రజలు కలిసికట్టుగా అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తారు.. ఒక వర్గం వారు బోనం కుండలను తయారు చేస్తే, మరొక వర్గం వారు పూజా సామగ్రిని సమకూరుస్తారు. అన్ని వర్గాల ప్రజలు ఒకే వేదికపై కలుసుకుని అమ్మవారిని దర్శించుకుంటారు.. ముస్లిం సోదరులు సైతం బోనాల ఊరేగింపులకు స్వాగతం పలుకుతూ భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే సందర్భాలు అనేకం కనిపిస్తాయి. ఈ విధంగా బోనాల పండుగ తెలంగాణ సమాజంలోని పరస్పర గౌరవం, సామరస్యం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తోంది.. బోనాలు కుటుంబ బంధాలను మరింత బలపరిచే పండుగ గానూ నిలుస్తాయి. దూర ప్రాంతాల్లో నివసించే ఆడపిల్లలను, బంధువులను ఈ పండుగ సందర్భంగా ఇంటికి ఆహ్వానించి, అందరూ కలిసి భోజనం చేయడం ద్వారా కుటుంబ అనుబంధాలు మరింత బలపడతాయి..

బూతులు తిడితే అది అశ్లీలత కాదు.. సుప్రీం కోర్టు సంచలన తీర్పు..

-3 పేజి తరువాయి

అంతేకాకుండా ఆ మాటల వల్ల పబ్లిక్ స్థలంలో ఇతరులకు ఇబ్బంది కలిగిందనే రుజువు కూడా ఉండాలి. ప్రస్తుత కేసులో నిందితుడు తిట్టిన తిట్లు కేవలం కోపంలో అన్నవే కానీ అవి చట్ట పరిధిలోని అశ్లీలత కిందికి రావు" అని అభిప్రాయపడింది. ఇదే ప్రాతిపదికన గొడవ పడేటప్పుడు వాడే హెచ్చరికలన్నీ క్రిమినల్ బెదిరింపుల కిందకు రావంటూ సెక్షన్ 506(ఏఏ) శిక్షను కూడా కోర్టు రద్దు చేసింది.

దాడి కేసులో శిక్ష ఖరారు.. కానీ రిలీఫ్..

బూతులు, బెదిరింపుల సెక్షన్లను కొట్టేసినప్పటికీ.. నిందితుడు కొడవలితో దాడి చేసి బాధితుడి ముక్కు ఎముకను విరగ్గొట్టినట్లు మెడికల్ రిపోర్టులలో స్పష్టంగా రుజువైంది. అందువల్ల సెక్షన్ 326
కింద నిందితుడి నేరాన్ని కోర్టు సమర్థించింది. అయితే ఈ వివాదం భూమి గొడవల వల్ల జరిగిందని, ప్రస్తుతం నిందితుడి వయస్సు దాదాపు 70 ఏళ్లు దాటడం, అతని ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు శిక్షను తగ్గించింది. కోర్టు సమయం ముగిసేవరకు జైలు శిక్ష విధిస్తూ, రూ. 50,000 జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ మొత్తాన్ని రెండు నెలల్లోగా చెల్లించాల్సి ఉంటుంది.

కేసీఆర్ కుటుంబీకులు నిజాం రాజును మించిన ధనవంతులుగా మారారు

-3 పేజి తరువాయి

అటువంటి ప్రయత్నం చేస్తే ఎదిరించడానికి అందెశ్రీ పాట రూపంలో పుడతాడని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందెశ్రీని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని దుయ్యబట్టారు. ప్రజాకవి గద్దర్‌ను సైతం ప్రజాభవన్ గేటు వద్ద ఎర్రటి ఎండలో నిలబెట్టి అవమానించారని మండిపడ్డారు. వారిద్దరిని అవమానించినప్పుడే దొరల పాలనకు చరమగీతం పాడాలని తెలంగాణ ప్రజలు నిర్ణయించుకున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ తప్పనిసరి

-3 పేజి తరువాయి

హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. రోజూ రాష్ట్రవ్యాప్తంగా 11,457 ఆరోగ్య సంస్థల నుంచి 31.27 టన్నుల బయో మెడికల్ వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని అధికారులు వివరించారు. ప్రస్తుతం 13 కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ కేంద్రాలకు అనుమతులు ఉండగా, అందులో 11 కేంద్రాలు పనిచేస్తున్నాయని తెలిపారు. యూజర్ ఛార్జీల పెంపుపై ప్రతిపాదనలు తీసుకుని త్వరలో తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు.బయోమెడికల్ వ్యర్థాలను 48 గంటల్లోపు సేకరించి శుద్ధి చేయాలని, నిర్వహణలో ఆధునిక సాంకేతికత వినియోగించాలని, సిబ్బందికి నిరంతర శిక్షణ ఇవ్వాలని ఆమె సూచించారు. వరంగల్‌లో ప్లాస్టిక్ బాటిళ్ల సేకరణను పైలట్ ప్రాజెక్టుగా చేపట్టడంతో పాటు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అటవీ, పర్యావరణశాఖల ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, పీసీబీ సభ్యకార్యదర్శి జి.రవి, చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ బి.రఘు, వైద్యారోగ్యశాఖ, ఈపీటీఆర్ఐ అధికారులతో పాటు.. తెలంగాణ ఆసుపత్రులు, నర్సింగ్‌హోంల అసోసియేషన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్‌మెంట్ కేంద్రాల ప్రతినిధులు హాజరయ్యారు.

గురుకుల విద్యార్థులే తెలంగాణ బ్రాండ్ అంబాసిడర్లు

హైదరాబాద్ పెన్ పవర్: గురుకులాల విద్యార్థులే తెలంగాణకు భవిష్యత్తు బ్రాండ్ అంబాసిడర్లు అని ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, సంస్కరణలతో మెరుగైన ఫలితాలు వస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత మంది వైద్యులు, ఒలింపియన్లు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, సివిల్ సర్వెంట్లు గురుకులాల నుంచి రావాలని మంత్రి ఆకాంక్షించారు. ఎస్సీ గురుకుల సొసైటీలో నీట్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్‌లో 4?ల400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణపతకం సాధించిన ప్రవళిక మంత్రి అడ్లూరి ఆధ్వర్యంలో శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మెరుగైన ఫలితాలు, ప్రతిభ చూపిన విద్యార్థులను సీఎం ఈ సందర్భంగా అభినందించారు.

స్వయం ఉపాధి కార్యక్రమాలతో పాటు స్థానిక సంస్థల్లో కోఆప్షన్ సభ్యులను నియమించాలని మంత్రిమండలి తీసుకున్న నిర్ణయం పట్ల ట్రాన్స్‌జెండర్లు హర్షం వ్యక్తం చేస్తూ.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను సచివాలయంలో సన్మానించారు.

ఆర్ఎంపి ,పిఎంపి వైద్యులపై దాడులు ఆపండి

హైదరాబాద్ పెన్ పవర్: రాష్ట్రం లో గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ప్రాథమిక చికిత్స ,వైద్య అందిస్తున్న =వీూ ఔూవీూ వైద్యులపై దాడులు ఆపాలని =వీూ ఔూవీూ వైద్యుల అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.ఈ మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ ను అసిసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బా చంద్రశేఖర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెండెం నాగభూషణం ల బృందం కలిసి వినతి పత్రంసమర్పించారు.గ్రామీనా ప్రాంతలల్లో నిరుపేదలకు వైద్యం అందించడం లో=వీూ ఔూవీూ వైద్యులు చేస్తున్న సేవలను వారు మంత్రి దృష్టికి తెచ్చారు.వీరిపై వైద్యాది కారులు చిన్న ఛ్చిన్న కారణాలు చూపి దాడులకు పాల్పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మంత్రిని కలిసిన వారిలో వంజరి విష్ణు .కృష్ణమూర్తి .హేమశ్రీనివాస నాయక్ శ్రీనివాస్ . నారాయణ దాస్ .దినకర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలు

హైదరాబాద్ పెన్ పవర్: అడ్డగూడూర్ మండలం ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధి ప్రదాత, మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం అడ్డగూడూరు మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగదీశ్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, టౌన్ అధ్యక్షుడు నాగులపెల్లి దేవగిరి, మాజీ ఎంపీటీసీ పూలపల్లి జనార్దన్ రెడ్డి, సర్పంచ్ పూజారి వనజ--సైదులు, కోటమర్తి సర్పంచ్ పాశం విష్ణువర్ధన్ రావు, అడ్డగూడూరు ఉప సర్పంచ్ వరిగడ్డి లోకేష్, నాయకులు గూడేపు పరమేష్, పయ్యావుల రమేష్, కన్నబోయిన ఎలేందర్, ఆనందాచారి, జక్కుల యాదగిరి, మందుల కిరణ్, పొన్నాల నవీన్ కుమార్, నర్సిరెడ్డి, చిత్తలూరు నరేష్, మారోజు వెంకన్న, రేఖల ఇమ్మానియేల్, శీలం దావీద్, ఇరుగు లక్ష్మణ్, ఇటికాల కుమారస్వామి, చుక్క ప్రభాకర్, గుగ్గిళ్ల భరత్, అవిరెండ్ల యాదయ్య, చిలుక యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

బండి, ఈటెల మధ్య సయోధ్య రంగంలోకి దిగిన అధిష్టానం

హైదరాబాద్ పెన్ పవర్:
తెలంగాణలో అధికారంలోకి రావాలని చాలా కృతనిశ్చయంతో ఉన్న బీజేపీ దిద్దుబాటు చర్యలకు దిగింది. ఇప్పటికే వేరే పార్టీల నుంచి నేతలను ఆహ్వానించాలని చెప్పిన హైకమాండ్, నేతల మధ్య విభేదాలపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా సీనియర్ నేతలు ఎవరికి వారుగా ఉంటున్న తీరుపై అసహనంతో ఉంది. అందుకే వారిని ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ముఖ్యంగా బీసీ వర్గానికి చెందిన ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య నెలకొన్న వివాదాలను పరిష్కరించాలని చూస్తోంది. అందుకు పార్టీ దూగా ఉన్న అభయ్ పాటిల్ జోక్యం చేసుకున్నారు. ఇద్దరి నేతలతో మీటింగ్ ఏర్పాటు చేసినట్టు సమాచారం. దీనికి సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదిక అయ్యిందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. తెలంగాణలో అధికారంలోకి రావాలని టార్గెట్ ఫిక్స్ చేసుకున్న బీజేపీ ఆ దిశగానే వ్యూహాలను రచిస్తోంది. అందులో భాగంగా ముందు పార్టీని దారిలో పెట్టాలని చూస్తోంది. అందులో భాగంగానే రాష్ట్ర పార్టీ పరిస్థితిపై ఎప్పటికప్పుడు నివేదికలు అడుగుతోంది. క్షేత్రస్థాయిలో పార్టీ బలాలు, బలహీనతలపై స్టడీ చేస్తోంది. ఈ రిపోర్టుల్లో నేతల మధ్య కోఆర్డినేషన్ లేదని తేలింది. అసలు ఒకరిద్దరు నేతల మధ్య సఖ్యత లేదని, తారాస్థాయిలో విభేదాలు ఉన్నట్టు వెల్లడైంది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన రిపోర్టులను పరిశీలించిన అనంతరం ముందుగా పార్టీ నేతలను దారిలోకి తీసుకురావాలని చూస్తోంది. ముఖ్యంగా ఈటల రాజేంద్ర, బండి సంజయ్ మధ్య ఉన్న విభేదాలు పార్టీకి చాలా ఇబ్బందిగా మారుతున్నాయని తెలుసుకుంది. ముందు వారిద్దరితోనే పార్టీ ప్రక్షాళన మొదలుపెట్టాలని చూస్తోంది. దీని కోసం పార్టీ దూతగా అభయ్ పాటిల్‌ను ఢిల్లీ నుంచి పంపించారు. అభయ్‌పాటిల్ వచ్చీరాగానే సంజయ్, ఈటలతో భేటీ రిపారు. సీనియర్ నేత, ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఈ సీక్రెట్ సమావేశం జరిగింది. ఇద్దరి నేతలు వారి వారి సమస్యలను ఆయన ముందు ఉంచారు. పార్టీలో చేరినప్పటి నుంచి ఒకరంటే ఒకరికి పడటం లేదని తేలింది. ఒకరిపై ఒకరు సీరియస్ ఫిర్యాదులు చేసుకున్నారు. దీనిపై అధిష్ఠానంతో మాట్లాడతాని ప్రస్తుతానికి కోఆర్డినేషన్‌తో కార్యక్రమాల్లో పాల్గొనాలని ఇరువురి నేతలకు అభయ్ హైకమాండ్ మాటగా చెప్పినట్టు తెలుస్తోంది. ఈ సమావేశం జరిగిన తర్వాత ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి రావడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై మాట్లాడామని అన్నారు.నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని వాటికి చెక్ చెప్పడానికే మీడియా ముందుకు వచ్చామని తెలిపారు. ఒక కుటుంబ పార్టీగా తాము మాట్లాడుకున్నామని అన్నారు. బీజేపీ అధికారంలోకి రావడానికే అంతా కలిసి కట్టుగా పని చేస్తామని తెలిపారు. తెలంగాణ మహిళా రిజర్వేషన్లు, సీట్ల సంఖ్య పెరుగుతుందని అన్నారు. తెలంగాణ జమిలీ ఎన్నికలే వస్తాయని లక్ష్మణ్ తెలిపారు. ఈ మీడియా సమావేశంలో ఈటల రాజేందర్, బండి సంజయ్ ఎంపీ లక్ష్మణ్ పక్కనే ఉన్నారు. అంతకంటే ముందు వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న వీడియోలు వైరల్ అవుతున్నాయి.



నీట్ ర్యాంకర్లను అభినందించిన సీఎం రేవంత్

హైదరాబాద్ పెన్ పవర్: నీట్లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఉన్నతాధికారులతో కలిసి విద్యార్థులు ఎంసీఆర్హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రీడాకారిణి ప్రవల్లికను అభినందించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ పెన్ పవర్:
చైనాలోని ఒర్డోస్లో జరిగిన తొలి ఆసియా అండర్–23 అథ్లెటిక్స్ ఛాంపియన్షిప్–2026లో మహిళల 4x400 మీటర్ల రిలే పోటీలో స్వర్ణ పతకం సాధించిన గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక ఎంసీఆర్హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి ని మర్యాదపూర్వకంగా కలిశారు.

హైడ్రాకు మద్దతుగా సంఘీభావ యాత్ర

హైదరాబాద్ పెన్ పవర్: హైడ్రాకు మద్దతుగా... నగరంలోని పలు కాలనీలు, బస్తీ వాసులు హైదరాబాద్ భారీ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ గార్డెన్స్ నుంచి సెక్రటేరియట్ ఎదురుగా ఉన్న అమరవీరుల దీపం వరకు ర్యాలీ కొనసాగింది.జై రేవంత్ రెడ్డి, జై రంగనాథ్ అంటూ నినాదాలు చేశారు.బోడుప్పల్‌అనఘారి కాలనీ, మేడిపల్లి టెలిఫోన్ కాలనీ సంక్షేమ సంఘం, వట్టినాగుల పల్లి, జయలక్ష్మి కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ప్లకార్డులు ప్రదర్శిస్తూ హైడ్రా మద్దతుగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.హైడ్రాను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలని కాలనీ వాసులు కోరారు.రెండు సంవత్సరాల్లో లక్షల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను కబ్జాదారుల చేరనుండి హైడ్రా కాపాడిందని వారు అన్నారు. పర్యావరణ పరిరక్షణలో హైడ్రా పాత్ర కీలకమని..గ్రేటర్ హైదరాబాదులో కాలుష్యాన్ని తగ్గించడానికి చెరువుల పునరుద్ధరణ కొనసాగాలని.. హైడ్రాను మరింత పటిష్టం చేసి శాశ్వతంగా కొనసాగి చాలని వారు డిమాండ్ చేశారు.57తెలంగాణ,ఏపీలో 6 రోజుల పాటు వర్షాలుబంగాళాఖాతంలో అల్పపీడనం బలపడటంతో ఆంధ్రప్రదేశ్,తెలంగాణలో జులై 23 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (×వీణ) తెలిపింది.తెలంగాణలోని పలు జిల్లాలతో పాటుగా ఏపీలోని కోస్తా ఆంధ్ర,యానాం, రాయలసీమ,తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు,ఉరుములు, మెరుపులు,గంటకు 50--70 కి.మీ.వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశముందని వెల్లడించింది.సముద్రం అల్లకల్లోలంగా ఉండటంతో జులై 21 వరకు మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరించింది.బీచ్‌ల వద్ద అలలు ఉధృతంగా ఉండనున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది

పోడు భూముల వివాదంలో ఫారెస్ట్ అధికారులు, గిరిజనుల మధ్య ఘర్షణ

భద్రాద్రి కొత్తగూడెం పెన్ పవర్:
అశ్వాపురం మండలం మనుబోతుల గూడెంలో పోడు భూముల వివాదంలో ఫారెస్ట్ అధికారులు, గిరిజనుల మధ్య ఘర్షణ చెలరేగింది. ఒకరిపై ఒకరు పరస్పర దాడులు చేసుకున్నారు. ఘటనలో ముగ్గురు గిరిజన మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన మహిళలను మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో చికిత్స జరుగుతోంది. మణుగూరు ఫారెస్ట్ రేంజర్ ఉపేందర్ నేతృత్వంలో సుమారు 40 మంది సిబ్బందితో గిరిజనులపై దాడి చేశారని గ్రామస్థుల ఆరోపణ.మహిళలని కూడా చూడకుండా అటవీ సిబ్బంది విసిరిపారేశారని, అమానుషంగా ప్రవర్తించారని గిరిజనులు మండిపడ్డారు. రహదారులు, కమ్యూనికేషన్ లేని మారుమూల గ్రామం కావడంతో ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఘటన పై విచారణ జరిపి న్యాయం చేయాలని గిరిజనుల డిమాండ్

78 టీ-హబ్ బేబీ 'స్కైరూట్' చరిత్ర సృష్టించింది: కేటీఆర్

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్: హైదరాబాద్ సరూర్ నగర్ వేదికగా జరిగిన 'యువ సంగ్రామ సదస్సు'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ నమోదైన కీలక అంతరిక్ష విజయాన్ని పంచుకున్నారు. దేశంలోనే తొలిసారిగా శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్–1' విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత రికార్డు సృష్టించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ మరెక్కడో కాదు.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'టీ–హబ్' వేదికగానే పురుడు పోసుకుందని గర్వంగా ప్రకటించారు.భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయిన తరుణంలో... దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఘనత స్కైరూట్ కంపెనీకే దక్కుతుందని కేటీఆర్ కొనియాడారు. మన హైదరాబాద్‌లోని టీ–హబ్ వేదికగా స్టార్టప్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన ఒక సంస్థ, ఇవాళ ప్రపంచ స్థాయిలో దేశం గర్వించేలా ఎదగడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు.శ్రీహరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం అత్యంత విజయవంతంగా ముగిసిందని కేటీఆర్ తెలిపారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించిన స్కైరూట్ టీమ్‌కు సభకు హాజరైన నిరుద్యోగ యువత, విద్యార్థులంతా చప్పట్లతో ఘనంగా అభినందనలు తెలపాలని అన్నారు.మరోవైపు, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సహకారంతో ప్రైవేట్ రంగానికి చెందిన తొలి దేశీయ రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతో... అటు ఇస్రో సైంటిస్టులతో పాటు ఇటు స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లోనూ పండుగ వాతావరణం నెలకొంది.

సీపీ కనెక్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించిన సీపీ

సిద్దిపేట: పెన్ పవర్: పోలీస్ సిబ్బందిలో ఉత్తమ సేవలను గుర్తించే సంస్కృతిని పెంపొందించడానికి మరియు వారి మనోధైర్యాన్ని పెంచడానికి సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, సీపీ కనెక్ట్ అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజానికి సేవ చేస్తూ, ప్రాణాలను కాపాడుతూ తమ విధుల్లో అసాధారణమైన అంకితభావాన్ని ప్రదర్శించిన పోలీస్ అధికారులు, సిబ్బందిని వ్యక్తిగతంగా అభినందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.నేరాల గుర్తింపు, ప్రాణాలను రక్షించడం, కమ్యూనిటీ పోలీసింగ్ మరియు ప్రజల భద్రతను నిర్ధారించడంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన వారికి సీపీ వ్యక్తిగతంగా ప్రశంసా పత్రాలను అందజేస్తారు. ప్రతి నెలలోని ప్రతి శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం వల్ల సిబ్బందికి తమ విధుల పట్ల మరింత బాధ్యతాయుతమైన భావం, ఉత్సాహం కలగడమే కాకుండా, ఇతరులకు కూడా ఇది ఒక ప్రేరణగా నిలుస్తుంది.

ఈ చొరవలో భాగంగా, జూలై 18 శనివారం నాడు పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'సీపీ కనెక్ట్' కార్యక్రమంలో సీపీ రష్మి పెరుమాళ్ విధుల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన 10 మంది పోలీస్ సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించి, వారికి ప్రశంసా పత్రాలు మరియు ప్రత్యేక గిఫ్ట్ కిట్‌లను అందజేశారు. అనంతరం సీపీ వారితో ముచ్చటించారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్, అడిషనల్ డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్, ఇన్‌స్పెక్టర్ కిరణ్, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ గౌడ్, ఆర్ ఎస్ఐ సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విక్రమ్-1 టెస్ట్ ఫ్లైట్-1 విజయం భారత అంతరిక్ష రంగ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టం

హైదరాబాద్ పెన్ పవర్:
పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఆర్బిటల్–క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్–1ను విజయవంతంగా పరీక్షించిన స్కైరూట్ ఏరోస్పేస్కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మిషన్ ఆగమన్లో భాగంగా నిర్వహించిన విక్రమ్–1 టెస్ట్ ఫ్లైట్–1 విజయం భారత అంతరిక్ష రంగ చరిత్రలో ఒక చారిత్రాత్మక ఘట్టమని, తెలంగాణకు గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

హైదరాబాద్కు చెందిన స్పేస్–టెక్ సంస్థ స్కైరూట్ ఏరోస్పేస్ సాధించిన ఈ విజయం దేశం అంతరిక్ష సాంకేతిక రంగంలో సాధిస్తున్న పురోగతికి నిదర్శనమని ముఖ్యమంత్రి అన్నారు. అంతరిక్ష అన్వేషణలో భారత యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే ఘనత స్కైరూట్కు దక్కిందని ప్రశంసించారు. ఈ ఏడాది ఏప్రిల్లో శంషాబాద్లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్లో ఉన్న స్కైరూట్ ఏరోస్పేస్ మ్యాక్స్–క్యూ క్యాంపస్ను సందర్శించిన సందర్భంగా, మిషన్ ఆగమన్ ప్రయోగ కార్యక్రమానికి ముందు విక్రమ్–1 ఫ్లైట్ హార్డ్వేర్ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని ముఖ్యమంత్రి గారు గుర్తు చేశారు. విక్రమ్–1 విజయవంతమైన టెస్ట్ ఫ్లైట్ తెలంగాణను ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, స్పేస్ టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశలో మరో కీలక మైలురాయిగా నిలిచిందన్నారు.

ఈ విజయం ద్వారా ఏరోస్పేస్ ఆవిష్కరణలు, అధునాతన తయారీ రంగం, తదుపరి తరం అంతరిక్ష సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణ అనువైన గమ్యస్థానంగా మరింత బలపడిందని ముఖ్యమంత్రి తెలిపారు. స్కైరూట్ వంటి సంస్థల విజయాలు రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతలో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందించి, భావితర ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తినిస్తాయని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు

రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది"

హైదరాబాద్ పెన్ పవర్:
శంషాబాద్ మండలం బహుద్దూర్‌గూడలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు టెర్మినల్ కోసం భూముల సేకరణ అంశం ఉద్రిక్తతకు దారితీసింది. భూముల సేకరణ కోసం అధికారులు గ్రామానికి చేరుకోగా, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు, సరైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములు ఇస్తామని రైతులు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న బాధిత రైతులు, గ్రామస్తులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం ఆయనను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నందిగామ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు రాజా వరప్రసాద్, రాంబల్ నాయక్, వంకాయల నారాయణ రెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్ నందిగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కార్తీక్ రెడ్డికి సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న నాయకుడిని అరెస్టు చేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నందిగామ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, పోలీసులు అరెస్టు చేసినంత మాత్రాన తాను వెనక్కి తగ్గేది లేదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు

పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. "అరెస్టులతో భయపడేది లేదు. రైతులకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు. రైతుల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతాం" అని కార్తీక్ రెడ్డి అన్నారు.

బహుద్దూర్ గూడ రైతులకు న్యాయమైన పరిహారం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు ఇవ్వకుండా బలవంతంగా భూములు సేకరించే ప్రయత్నాలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు..

బీఆర్ఎస్‌కు మరో షాక్: 'ధరణి'పై ఫోరెన్సిక్ ఆడిట్

హైదరాబాద్ పెన్ పవర్: తెలంగాణ రాజకీయాలు మరోసారి సలసలమననున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే గత బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన కాళేశ్వరం సహా ఇతర ప్రాజెక్టులు, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈరేస్ వంటి వాటిలో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆయా కేసులను తవ్వి తీస్తోంది. ఇప్పుడు తాజాగా -ధరణి- పోర్టల్ వంతు వచ్చింది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో దీనిపై కీలకంగా చర్చించారు. సుమారు గంటన్నరకు పైగా ధరణి పోర్టల్‌పై చర్చించిన మంత్రివర్గం.. దీనిలో జరిగిన అవకతవకలు, అవినీతిపై విచారణకు ఆదేశించాలని నిర్ణయించింది.

అయితే.. విచారణకు వెళ్లే ముందు.. ధరణి పోర్టల్‌పై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. అప్పుడు పక్కా ఆధారాలతో విచారణకు ఆదేశించేందుకు అవకాశం ఉంటుందని, రాజకీయంగా ఎలాంటి విమర్శలు ఉండవని కూడా ఆయన అభిప్రాయపడ్డారు. మొత్తంగా ధరణిపై ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా అవకతవకలు, అక్రమాలను వెలికి తీయాలని నిర్ణయించారు. ఇక, ఈ కేబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా కేంద్రం ప్రకటించిన బుల్లెట్ రైలు ప్రాజెక్టు విషయంపైనా సుదీర్ఘంగా చర్చించారు. భూసేకరణపై వస్తున్న వివాదాలను సాధ్యమైనంత వేగంగా పరిష్కరించే బాధ్యతను మంత్రులు తీసుకోవాలని సీఎం సూచించారు.బుల్లెట్ రైలు రాకతో రాష్ట్ర ముఖ చిత్రం మారుతుందని.. అయితే, దీనిని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నిస్తున్నాయని వ్యాఖ్యానించిన సీఎం రేవంత్ రెడ్డి.. ప్రజలను ఒప్పించి భూ సేకరణకు అనుకూలంగా మార్చాలని ఆయన మంత్రులకు సూచించారు. బుల్లెట్ రైలు రాకతో రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు పెరగడంతో పాటు, పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. అలాగే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఈ ప్రాజెక్టును సాధ్యమైనంత వేగంగా పట్టాలెక్కించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అయితే.. భూముల ధరలు మరీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రాజెక్టు అలైన్‌మెంటును మార్పు చేసేందుకు వెనుకాడవద్దని కూడా సీఎం సూచించారు.

మరిన్ని నిర్ణయాలు ఇవీ..

పటాన్‌చెరు నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులను పూర్తి చేయనున్నారు.
జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పలు టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేస్తారు.
పంచాయతీలను బలోపేతం చేసేందుకు వీలుగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018కు సవరణలను ఆమోదించారు.అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో ఈ సవరణలను ఆమోదించనున్నారు.

ఏంటీ ధరణి..?

తెలంగాణలో కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్ల కోసం ధరణి పోర్టల్‌ను తీసుకువచ్చారు. ఇది భూ రికార్డులను పారదర్శకంగా ఉంచడానికి ప్రతిపాదించిన కీలక ప్రాజెక్టు. అయితే, సాంకేతిక లోపాలు, అవకతవకల ఆరోపణలతో తీవ్ర వివాదాస్పదమైంది. ధరణి పోర్టల్ ద్వారా భూముల కొనుగోలు, అమ్మకం, వారసత్వ బదిలీలు, ఇతర వ్యవహారాలు అన్నీ ఆన్‌లైన్ ద్వారానే ఒకే చోట జరుగుతాయి. దీనిలో తహసీల్దారుకు సంయుక్త సబ్ రిజిస్ట్రార్ హోదా కల్పించి నేరుగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేలా డిజైన్ చేశారు.

వివాదం ఎందుకు?

పోర్టల్‌లో ఓటీపీ, వేలిముద్రలు లాంటి ప్రాథమిక ధ్రువీకరణలు లేకుండానే.. కొందరు ప్రైవేట్ వ్యక్తులు, సైబర్ నేరగాళ్లు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ వాడి భూములను ఇతరుల పేర్లకు మార్చేశారనే తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ధరణిలో జరిగిన భారీ అక్రమాలు, భూ రికార్డుల ట్యాంపరింగ్‌పై సమగ్ర విచారణకు ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ పోర్టల్ రూపకల్పన, నిర్వహణ బాధ్యతలు ప్రైవేట్ వ్యక్తుల చేతిలో ఉండటంతో రైతుల భూ సమాచారం గోప్యతకు భంగం వాటిల్లుతుందనే ఆందోళనలు వెల్లువెత్తాయి. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ఆడిట్‌కు ఆదేశించాలని నిర్ణయించింది.

ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి

అధికారులు అప్రమత్తంగా పనిచేయాలి

ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి

నిజామాబాద్ జూలై 18 పెన్ పవర్: నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో =బొ, మిషన్ భగీరథ ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.
వర్షాకాలంలోనూ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించిన ఎమ్మెల్యే, మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో లీకేజీలు, ఇతర సాంకేతిక సమస్యలు ఎక్కడా లేకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు.మరమ్మత్తులు అవసరమైన చోట వెంటనే పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని చెప్పారు.

నీటి వృథాను నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో నీటి పొదుపుపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే భూగర్భ జలమట్టం పెరిగేలా నీటి సంరక్షణ కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.
తాగునీటి సరఫరాలో సమయపాలన పాటించాలని, ప్రతి గ్రామానికి నిర్ణీత సమయానికి నీటిని అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
తాగునీటి నాణ్యతపై నిరంతరం క్వాలిటీ చెకింగ్ నిర్వహించాలని, శిథిలావస్థలో ఉన్న వాటర్ ట్యాంకులను గుర్తించి తగిన మరమ్మత్తులు చేయాలని సూచించారు. ప్రమాదకర స్థితిలో ఉన్న వాటర్ ట్యాంకులను వెంటనే డిస్మెంటల్ చేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు లేకుండా చూడాలని అన్నారు. ప్రజల నుంచి తాగునీటి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు రాకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని, సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.
అధికారులకు ఎలాంటి పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
అయితే తాగునీటి సరఫరాలో అలసత్వం, నిర్లక్ష్యం ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు.
ఈ సమావేశంలో =బొ (మిషన్ భగీరథ) ఈఈలు కే. రాకేష్, నరేష్ బాబు, డీఈఈలు నవీన్ రెడ్డి, కౌశిక్, వెంకటేశ్వర్ గౌడ్, ఏడు మండలాల ఏఈఈలు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది

హైదరాబాద్ పెన్ పవర్:
గ్రామాల సమగ్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇందల్వాయి గ్రామ అభివృద్ధి కోసం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ాణఖీ) నిధుల కింద రూ.23 లక్షల విలువైన ప్రొసీడింగ్ పత్రాలను కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు నవీన్ గౌడ్ నేతృత్వంలో గ్రామ సర్పంచ్, లోకాని గంగామణి- గంగాధర్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇందల్వాయి గ్రామ అభివృద్ధికి ఇప్పటికే లక్షల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గ్రామంలో అర్హులైన పేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రెండో విడతలో మరిన్ని అర్హులకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎస్‌డీఎఫ్ నిధుల కింద ముదిరాజ్ సంఘం అభివృద్ధికి రూ.5 లక్షలు, కుమ్మరి సంఘానికి రూ.5 లక్షలు, ఇందల్వాయి శ్రీ రామాలయం ప్రాంగణంలో కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్ నిర్మాణానికి రూ.10 లక్షలు, శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కాంపౌండ్ వాల్ నిర్మాణానికి రూ.3 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.
ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, దేవాలయాలు, సామాజిక భవనాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజల సహకారంతో ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షులు, సభ్యులు, ముదిరాజ్, కుమ్మరి సంఘం నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును మెరుగుపర్చుకోవాలి

హైదరాబాద్ పెన్ పవర్: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు డ్యూటీ,కోర్టు లైజనింగ్ పోలీసు అధికారులతో శనివారం సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కోర్టు విధుల నిర్వహణ, కేసుల పురోగతి,శిక్షల శాతం పెంపు, సాంకేతిక సమస్యలు, సాక్షుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ,కోర్టు విధులకు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు.విధుల నిర్వహణలో ఎదురయ్యే పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలను దాచిపెట్టకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.కోర్టు డ్యూటీ అధికారుల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రతి అధికారి తన పనితీరును మరింత మెరుగుపర్చుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. సమన్లు,బెయిలు మంజూరు కాని అరెస్టు వారెం ట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), ఇతర వారెంట్ల అమలు,కోర్టుకు సంబంధించిన అన్ని ప్రక్రియలను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.సాక్షులను కోర్టుకు సకాలంలో హాజరు పరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సాక్షులకు కోర్టు ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి, వారు ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.విచారణ సమయంలో అనవసర గందరగోళానికి గురికాకుండా వారికి ధైర్యం చెప్పి,న్యాయ ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి కేసులో శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన, నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని సీపీ పేర్కొన్నారు.విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారులను ప్రతి నెల గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు.విధి నిర్వహణలో విశేష కృషి చేసి అనంతరం బదిలీపై వెళ్లిన అధికారుల దర్యాప్తు చేసిన కేసుల్లో తర్వాత శిక్షలు విధించబడినా, సంబంధిత అధికారుల సిఫారసు మేరకు వారికి కూడా గుర్తింపు,ప్రోత్సాహక బహుమతులు అం దజేస్తామని వెల్లడించారు .రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శిక్షల శాతాన్ని పెంచడం, ప్రతి కేసును సకాలంలో పూర్తి చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బందిని పోలీస్ కమిషనర్ శాలువాతో సత్కరించారు.

గాంధీనగర్ సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

హైదరాబాద్ పెన్ పవర్: తాండూర్ మండలం కొత్తపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీకి ఇక మట్టి రోడ్ల కష్టాలకు చెక్ పడనుంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రూ.5 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు, మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు సూరం రవీందర్ రెడ్డి నాయకత్వంలో, కొత్తపల్లి సర్పంచ్ ఆకుల వెంకటేష్ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రతి కాలనీ అభివృద్ధికి నిధులు కేటాయిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, మాదారం ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి, వార్డు సభ్యుడు జంబోజుల ప్రవీణ్, మాజీ మండల యువజన అధ్యక్షుడు పుట్ట శ్రీనివాస్, డేగ స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పుప్పాల శ్రీనివాస్, గాంధీనగర్ కాలనీవాసులు సత్యనారాయణ, హరి తదితరులు పాల్గొన్నారు.

ఎల్ నినో ప్రభావంపై రైతులకు అవగాహన.. ఏఈఓ రాకేష్

హైదరాబాద్ పెన్ పవర్: మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం కిష్టంపేట క్లస్టర్ పరిధిలోని కాసిపేట్ గ్రామంలో రైతులకు ఎల్ నినో ప్రభావం, పంట వైవిధ్యం అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ రాకేష్ మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావంతో సాధారణం కంటే వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్నందున రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అధిక నీటి అవసరం ఉన్న వరి వంటి పంటలకు బదులుగా కంది, పెసర, మినుము, శెనగ, జొన్న వంటి తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయ సాగు పద్ధతులు పాటించడంతో పాటు సేంద్రియ ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న రైతు బీమా, పంట రుణాలు, విత్తన సబ్సిడీ వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ నినో ప్రభావంతో ఏర్పడే కరువు పరిస్థితులను ఎదుర్కోవడంలో పంటల వైవిధ్యమే సమర్థవంతమైన మార్గమని, దీనివల్ల రైతుల నష్టాలు తగ్గి ఆదాయం స్థిరంగా ఉండే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొని పంటల ఎంపిక, సాగు పద్ధతులపై అధికారుల నుంచి సూచనలు, సలహాలు పొందారు

ఆకట్టుకున్న 'త్రిశక్తి సారీస్' చీరల ప్రదర్శన

కరీంనగర్: పెన్ పవర్: కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో గల వారాహి బకెట్ హాల్ వేదికగా జ్యోత్స్న ప్రియ ప్రసన్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "త్రిశక్తి సారీస్" చీరల ఎగ్జిబిషన్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు విచ్చేసి ఈ చీరల ప్రదర్శనను ప్రారంభించి చీరలను కొనుగోలు చేయడం జరిగింది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ-వేణు 41వ డివిజన్ కార్పొరేటర్ నాంపల్లి రేణుక- శ్రీనివాస్ బిజెపి నాయకులు పండుగ నాగరాజు, ఉపేందర్, సాయి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాలకు చివరి అవకాశం

- దోస్త్ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదల

కరీంనగర్: పెన్ పవర్: 2026--27 విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న దోస్త్ స్పెషల్ ఫేజ్ షెడ్యూల్ విడుదలైనట్లు ఎస్.ఆర్.ఆర్. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ తెలిపారు. కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీబీఏ, బీఏతో పాటు ఏఈడీపీ బీఎస్సీ హెల్త్ కేర్ తదితర కోర్సుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జూలై 20 నుంచి 26 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు, జూలై 20 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. జూలై 30న సీట్ల కేటాయింపు జరగనుండగా, జూలై 30 నుంచి ఆగస్టు 1 వరకు ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, జూలై 31 నుంచి ఆగస్టు 1లోపు ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాలలో రిపోర్ట్ చేయాలని సూచించారు. మూడు విడతల్లో ప్రవేశం పొందని విద్యార్థులు రిజిస్ట్రేషన్ ఫీజు లేకుండానే స్పెషల్ ఫేజ్‌లో పాల్గొనవచ్చని, కొత్తగా నమోదు చేసుకునేవారు రూ.400 ఫీజు చెల్లించాలని తెలిపారు. నిర్ణీత గడువులో రిపోర్ట్ చేయని పక్షంలో కేటాయించిన సీటు రద్దు అవుతుందని హెచ్చరించారు.

ఎస్ఐఆర్ కార్యక్రమం

వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకున్న

నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ పెన్ పవర్:
ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో 67వ బూత్‌కు చెందిన బీఎల్ఓ సమక్షంలో ఎస్ఐఆర్ ఫారంలో వ్యక్తిగత వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం వాటిని డిజిటల్ విధానంలో ధ్రువీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. ఈ సందర్భంగా ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని, ఓటరు జాబితా తప్పులులేకుండా రూపొందించేందుకు సహకరించాలని మేయర్ కోరారు. కార్యక్రమంలో బీఎల్ఓతో పాటు జీపీఓ పరశురాములు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పెందుర్తిలో మూడు ముక్కలాట

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:విశాఖపట్నం జిల్లాలోని పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం రాజకీయంగా ఎప్పుడూ ప్రత్యేక గుర్తింపు కలిగిన స్థానం. 1979లో ఏర్పాటైన ఈ నియోజకవర్గం నుంచి పలువురు ప్రముఖ నాయకులు ఎమ్మెల్యేలుగా ఎన్నికై రాష్ట్ర రాజకీయాల్లో తమ ముద్ర వేశారు. ద్రోణంరాజు సత్యనారాయణ వంటి సీనియర్ నాయకులు కూడా ఇక్కడి నుంచే శాసనసభకు ప్రాతినిధ్యం వహించారు. దీంతో ప్రతి ఎన్నికల్లో ఈ నియోజకవర్గంపై ప్రధాన పార్టీల దృష్టి ఎక్కువగా ఉంటుంది.
నియోజకవర్గాల పునర్విభజన తర్వాత పరవాడ మండలం పెందుర్తి పరిధిలోకి రావడంతో రాజకీయ సమీకరణాలు కూడా మారాయి. ఆ సమయంలో మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి తన రాజకీయ కేంద్రాన్ని పెందుర్తికి మార్చుకున్నారు. 2014 ఎన్నికల్లో ఆయన విజయం సాధించినప్పటికీ, 2009 మరియు 2019 ఎన్నికల్లో ఓటమిని ఎదుర్కొన్నారు. అనంతరం 2024 ఎన్నికల సందర్భంగా ఆయనను మాడుగుల నియోజకవర్గానికి మార్చగా, కూటమి ఒప్పందంలో భాగంగా పెందుర్తి స్థానాన్ని జనసేన కి కేటాయించారు. అక్కడ నుంచి పంచకర్ల రమేష్ బాబు విజయం సాధించి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.అయితే భవిష్యత్ రాజకీయాలపై బండారు సత్యనారాయణమూర్తి ఇప్పటి నుంచే వ్యూహాలు రచిస్తున్నారని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కుమారుడు బండారు అప్పలనాయుడు ను రాజకీయాల్లోకి తీసుకురావాలని ఆయన భావిస్తున్నారని తెలుస్తోంది. అందుకే తమ కుటుంబానికి బలమైన పట్టున్న పెందుర్తి నుంచే ఆయనను బరిలోకి దించాలని ప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం ఉంది. 2029 ఎన్నికల్లో తన వారసుడికి అవకాశం కల్పించి, అనంతరం క్రియాశీల రాజకీయాలకు దూరం కావాలనే ఆలోచనలో ఆయన ఉన్నారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పెందుర్తిలో పార్టీ కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ తన అనుచరులను ఏకతాటిపై ఉంచే ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం.మరోవైపు టీడీపీ లోనే మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ కూడా ఇదే స్థానంపై ఆశలు పెట్టుకున్నారు. గతంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసిన ఆయన తర్వాత టీడీపీలో చేరారు. 2019, 2024 ఎన్నికల్లో టికెట్ కోసం ప్రయత్నించినా అవకాశం రాలేదు. ప్రస్తుతం పార్టీ ఆయనకు పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలతో పాటు నామినేటెడ్ పదవిని కూడా అప్పగించింది. దీంతో వచ్చే ఎన్నికల్లో తనకే అవకాశం వస్తుందనే నమ్మకంతో ఆయన తన వర్గాన్ని మరింత బలోపేతం చేస్తున్నారని చెబుతున్నారు. దీనితో టీడీపీలోనే రెండు వర్గాల మధ్య పోటీ వాతావరణం నెలకొన్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో జనసేన కూడా ఈ స్థానాన్ని తమకు కీలకమైన నియోజకవర్గంగా భావిస్తోంది. ప్రజారాజ్యం పార్టీ కాలంలో తొలిసారి ఈ ప్రాంతంలో విజయం సాధించిన పంచకర్ల రమేష్ బాబు, 2024లో జనసేన అభ్యర్థిగా మరోసారి గెలిచి తన రాజకీయ బలాన్ని నిరూపించుకున్నారు. అందువల్ల 2029 ఎన్నికల్లో కూడా ఆయననే బరిలో దింపాలని జనసేన భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది.ఈ పరిణామాల నేపథ్యంలో పెందుర్తి నియోజకవర్గం కూటమి రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు కేంద్రంగా మారింది. టీడీపీలోనే నాయకుల మధ్య టికెట్ పోటీ ఉండగా, జనసేన కూడా ఈ స్థానాన్ని వదులుకునే పరిస్థితిలో కనిపించడం లేదు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఈ సీటు ఏ పార్టీకి దక్కుతుంది, ఎవరు అభ్యర్థిగా నిలుస్తారు అనే అంశం ఇప్పటి నుంచే రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

సేనతో నేను..

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:
జనసేన పార్టీ స్థానిక ఎన్నికల కోసం సమాయత్తమవుతుంది. సెప్టంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు ఆంధ్రప్రదేశ్ లో జరగనున్నాయి. దీంతో జనసేన అప్రమత్తమయింది. కార్యకర్తల్లో ఉన్న నిరాశ, నిస్పృహలను తొలగించడానికి జనసేన అధినేత పవన్ కల్యాణ్ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చర్చా వేదిక కార్యక్రమాన్ని నియోజకవర్గాల వారీగా నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ కోసం పాటుపడ్డ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామన్న నినాదంతో కార్యకర్తల్లో తిరిగి ఉత్సాహం నింపేందుకు ఆ పార్టీ ఈ కార్యక్రమం డిజైన్ చేసిందని చెప్పాలి. క్షేత్ర స్థాయిలో కార్యకర్తలకు ఎదురవుతున్న సవాళ్లపై పార్టీ దృష్టి పెట్టిందని అనుకోవాలి. నియోజకవర్గాల వారీగా చర్చా వేదికను ఏర్పాటు చేసి కార్యకర్తల మనసులో మాటను విని వారి సమస్యల పరిష్కారానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. పవన్ కల్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స జరగడంతో ఈ బాధ్యతను మంత్రి నాదెండ్ల మనోహర్ తీసుకున్నారు. జనసేన లో ఏ గ్రూపులు ఉండవని, పవన్ కల్యాణ్ గ్రూపు ఒక్కటే ఉంటుందని కార్యకర్తలకు చెబుతున్నారు. ఈ వేదిక ద్వారా నాయకులు, కారకర్తల సమన్వయం కుదర్చడమే ప్రధాన లక్ష్యంగా కనిపిస్తుంది. జనసేన పార్టీకి క్రియాశీలక సభ్యత్వం 24 లక్షల మార్క్ కు చేరుకుంది. నియోజకవర్గాల్లో జనసైనికులు ఎదుర్కొంటున్న సమస్యలు విని వాటిని పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని హామీ ఇవ్వనున్నారు. . స్థానిక సంస్థల ఎన్నికల్లో పోలింగ్ బూత్ లెవెల్ లో నిలబడి పార్టీకి ఓటు వేయించాలంటే కార్యకర్త ఉత్సాహంగా ఉండాలి. ఆ ఉత్సాహం నింపేందుకే ఈ కార్యక్రమం అనుకోవాలి. పవన్ కల్యాణ్ భుజానికి శస్త్ర చికిత్స కారణంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉండకపోవచ్చు. అందుకే ముందు నుంచే కార్యకర్తలను ఎన్నికలకు సమాయత్తం చేయాలంటే వారి సమస్యలను అడిగి తెలుసుకుని, వారికి నాయకత్వం దగ్గరగా ఉందని భరోసా ఇవ్వగలిగితే చాలా వరకూ ప్రయోజనం ఉంటుంది. అందుకే చర్చా వేదిక ద్వారా కార్యకర్తలకు పార్టీని మరింత దగ్గరకు చేర్చే ప్రయత్నం చేస్తున్నారు. జనసనకు బలం ఉన్న ప్రతి చోటా పోటీ చేస్తామని చెబుతూ కొంత ధైర్యాన్ని ఇస్తున్నారు. మొత్తం మీద క్యాడర్ ను తిరిగి అక్కున చేర్చుకునే ప్రయత్నంలో జనసేన ఎంత వరకూ సక్సెస్ అవుతుందో చూడాలి.

ఎండ్రిన్ మీరు తాగాలి

బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో వెల్లువెత్తిన నిరసన

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:
హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన సభలో ఓ నిరుద్యోగ యువతి కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన 2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని ఆస్మా అనే యువతి నిలదీశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను మోసం చేశారని ఆమె మండిపడ్డారు.బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు'లో ఆస్మా మాట్లాడుతూ.. రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చే వరకు తమ పోరాటం ఆపబోమని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసి పెద్ద తప్పు చేశామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే అన్ని ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గతంలో నిరుద్యోగులను ఉద్దేశించి రేవంత్ రెడ్డి చేసిన 'ఎండ్రిన్ తాగాలి' అనే వ్యాఖ్యలను గుర్తుచేస్తూ ఆమె తీవ్రంగా స్పందించారు. "ఎండ్రిన్ తాగాల్సింది మేము కాదు.. నువ్వే. ఊరూరా తిరిగి నిన్ను గెలిపించిన పాపానికి ముందు నువ్వు, తర్వాత రాహుల్ గాంధీ, ఆ తర్వాత ప్రియాంక గాంధీ తాగాలి" అంటూ సీఎంను ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు.

హామీలపై అడిగితే అరెస్ట్ చేస్తారా

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:తెలంగాణలో నిరుద్యోగుల సమస్యలపై, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలతపై గళమెత్తేందుకు బీఆర్ఎస్ చేపట్టిన 'యువ సంగ్రామ సదస్సు' తీవ్ర ఉత్కంఠ రేపుతోంది. సరూర్ నగర్ స్టేడియంలో మరికాసేపట్లో ప్రారంభం కానున్న ఈ సదస్సుపై ప్రభుత్వం తొలుత ఆంక్షలు విధించింది. దీంతో, బీఆర్ఎస్ ఏకంగా హైకోర్టు మెట్లెక్కి మరీ న్యాయబద్ధంగా అనుమతి తెచ్చుకుంది. అయితే సభ ప్రారంభానికి ముందే పోలీసులు చర్యలు చేపట్టారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డితో పాటు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌లను పోలీసులు వారి ఇళ్లలోనే హౌస్ అరెస్టు చేశారు.ఈ నిర్బంధంపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ తన నివాసం నుండి ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ఇవాళ ఉదయాన్నే పోలీసులు తనను అరెస్టు చేయడానికి ఇంటికి వచ్చారని ఆయన మండిపడ్డారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్న యువ సంగ్రామ సదస్సుకు తాను వెళ్లాల్సి ఉందని, దానికి హైకోర్టు అనుమతి కూడా ఉందని చెప్పినా పోలీసులు వినలేదన్నారు. తమకు పైనుంచి ఆదేశాలు ఉన్నాయని, మిమ్మల్ని ఎక్కడికీ పోనివ్వద్దని పోలీసులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయస్థానం పర్మిషన్ ఇచ్చినా కూడా అంబేద్కర్ రాసిన రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు.రాష్ట్రంలో కొనసాగుతున్న ఈ నిర్బంధకాండ నాడు ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ రోజులను తలపిస్తోందని ప్రవీణ్ కుమార్ దుయ్యబట్టారు. ఒకవైపు ఇలాంటి అరాచకాలకు పాల్పడుతూనే, మరోవైపు సిగ్గు లేకుండా ప్రజా పాలన అని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన వద్దే హోంశాఖను పెట్టుకుని, మొదటి నుంచీ బీఆర్ఎస్ సభలకు ఆటంకాలు సృష్టిస్తూనే ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎలాంటి కుట్రలు చేసినా తాను పోలీసుల ఆంక్షలు దాటుకుని సదస్సుకు వెళ్లి తీరుతానని స్పష్టం చేశారు. ఒకవేళ తనను ఇంటి నుంచి కదలనివ్వకుండా బలవంతంగా అడ్డుకుంటే అక్కడికక్కడే ఆమరణ నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు.

మానవత్వం చాటిన నైనిష ఫౌండేషన్ సభ్యులు

అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం..

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:
మణుగూరు మండలం రామానుజవరం గ్రామం అయోధ్య నగర్ కాలనీకి చెందిన కట్ట చిరంజీవి తీవ్ర అనారోగ్యంతో భద్రాచలంలోని సూర్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులతో వైద్య ఖర్చులు భరించలేని పరిస్థితిలో ఉండటాన్ని తెలుసుకున్న నైనిష ఫౌండేషన్ సభ్యులు మానవత్వంతో ముందుకు వచ్చి ఆయనకు రూ.3,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంలో ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందించడం సంస్థ లక్ష్యమని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి అండగా నిలుస్తామని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో నైనిష ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మట్టపల్లి సాగర్ యాదవ్, జర్నలిస్టులు పోదిల వీరబాబు, మిట్టపల్లి గోపి, అడ్వకేట్ ఈర్ల రాము, సాధిని సీతయ్య, బాణాల కృష్ణ, బానోతు రమేష్, కంపేర్ల నాగేశ్వరరావు, కట్ట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

తండ్రికి అదిరిపోయే గిఫ్ట్ ఇచ్చిన కూతురు

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:
తెలంగాణకు చెందిన ఓ యువతి తన తండ్రి 50వ పుట్టినరోజున ఆయనకు ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చింది. తన కలల బండిని కళ్ల ముందు చూసిన ఆ తండ్రి ఆనందంతో ఉప్పొంగిపోయారు. భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ హృద్యమైన దృశ్యాలను ఆ కూతురు వీడియో తీసి సోషల్ మీడియాలో పంచుకోగా, అది ఇప్పుడు వైరల్‌గా మారి లక్షలాది మంది హృదయాలను కదిలిస్తోంది.వివరాల్లోకి వెళితే.. నందిని కావేరి అనే యువతి తన తండ్రి పుట్టినరోజు కోసం కొన్ని వారాలుగా ఒక సర్‌ప్రైజ్ ప్లాన్ చేసింది. ఇన్నాళ్లూ తన కుటుంబం కోసమే బతికిన నాన్నకు గుర్తుండిపోయే బహుమతి ఇవ్వాలని ఆమె నిర్ణయించుకుంది. పుట్టినరోజునాడు, మొదట వీడియో కాల్‌లో నవ్వుతూ 'హ్యాపీ బర్త్‌డే డాడీ' అని శుభాకాంక్షలు చెప్పింది. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఆమె తండ్రిని ఇంటి బయటకు తీసుకువచ్చారు. అక్కడ ఒక పెద్ద వస్త్రంతో కప్పి ఉంచిన వస్తువును చూపించారు.ఏముందా అని ఆసక్తిగా ఆ గుడ్డను తొలగించిన తండ్రికి అక్కడ కొత్త మోటార్‌సైకిల్ కనిపించింది. దాన్ని చూసి ఆనందంతో ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. తీవ్రమైన భావోద్వేగంతో అక్కడున్న భార్య, పిల్లలను ఒక్కొక్కరిగా ఆలింగనం చేసుకున్నారు. ఆయన్ను చూసి కుటుంబ సభ్యులు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. ఈ మధుర క్షణాలు అందరినీ కదిలించాయి.ఈ వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంటూ నందిని ఒక ఎమోషనల్ పోస్ట్ రాసింది. "మా నాన్న తన జీవితాంతం మా కుటుంబానికే ప్రాధాన్యతనిచ్చారు. మాకు అన్నీ ఇచ్చారు కానీ తన కోసం ఏనాడూ ఏమీ అడగలేదు. అందుకే నేను ప్రతీ రోజూ కష్టపడి పని చేస్తున్నాను. ఆయన త్యాగాలకు, ప్రేమకు, నాపై ఉంచిన నమ్మకానికి ఇది ఒక చిన్న కృతజ్ఞత మాత్రమే" అని ఆమె పేర్కొంది. ఈ బహుమతి తన తండ్రి చేసిన త్యాగాలతో పోలిస్తే చాలా చిన్నదని, కానీ ఆయన మాకు ఎంత ఇష్టమో గుర్తుచేస్తుందని ఆశిస్తున్నానని తెలిపింది. ఈ సర్‌ప్రైజ్‌ను రహస్యంగా ఉంచడంలో సహాయం చేసిన తన తల్లికి, సోదరుడికి కూడా ఆమె ధన్యవాదాలు చెప్పింది.ఈ వీడియో చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. తండ్రి కళ్లలోని కన్నీళ్లు ఆయన చేసిన ఏళ్ల త్యాగాలను, కృతజ్ఞతను ప్రతిబింబిస్తున్నాయని పలువురు కామెంట్ చేశారు. తమ తల్లిదండ్రులకు కూడా ఇలాంటి బహుమతి ఇచ్చే స్థాయికి తాము ఎదగాలని చాలామంది ఆకాంక్షించారు. తల్లిదండ్రుల నిస్వార్థ త్యాగాలకు దక్కే గుర్తింపు ఎంత విలువైనదో ఈ వీడియో గుర్తు చేస్తోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

ఏపీకి రికార్డులు అందంచిన వక్ఫ్

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:
రాష్ట్ర విభజన జరిగి పన్నెండేళ్ల తర్వాత ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న ఒక కీలక వివాదానికి ఎట్టకేలకు తెరపడింది. ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన వేలాది వక్ఫ్ ఆస్తుల రికార్డులను తెలంగాణ వక్ఫ్ బోర్డు ఏపీకి అప్పగించింది. ఈ బదలాయింపుతో గత పదేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి మొత్తం 3,503 ఫైళ్లు, 4,050 సర్వే కమిషనర్ నివేదికలు, రెండు అధికారిక గెజిట్ వాల్యూమ్‌లతో పాటు ఇతర కీలక పత్రాలను ఏపీ వక్ఫ్ బోర్డు అధికారులు స్వీకరించారు. ఇదొక చారిత్రక మైలురాయి అని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు అవసరమైన కీలక ఆధారాలు ఇప్పుడు తమ వద్ద ఉన్నాయని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు.2014లో రాష్ట్ర విభజన సమయంలో వక్ఫ్ చట్టం-1995 నిబంధనల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన రికార్డులు, ఆస్తులు, నిధులు బదిలీ కావాల్సి ఉన్నప్పటికీ, ఆ ప్రక్రియ దశాబ్ద కాలానికి పైగా స్తంభించిపోయింది. కీలక రికార్డులు అందుబాటులో లేకపోవడంతో ఆస్తుల యాజమాన్య హక్కులను నిర్ధారించడం, ఆక్రమణలను నిరోధించడం, న్యాయస్థానాల్లో కేసులను సమర్థవంతంగా వాదించడం ఏపీ వక్ఫ్ బోర్డుకు పెను సవాలుగా మారింది.ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రులు నారా లోకేశ్, ఎన్.ఎం.డి. ఫరూక్ అందించిన సహకారంతో పాటు, తాము జరిపిన ఉన్నత స్థాయి చర్చలు ఫలించాయని అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. ఈ రికార్డుల లభ్యతతో వక్ఫ్ ఆస్తుల నిర్వహణను క్రమబద్ధీకరించడం, వివాదాలను వేగంగా పరిష్కరించడం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. ఇదే క్రమంలో తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఏపీకి సుమారు రూ. 55 కోట్ల నిధులు రావాల్సి ఉందని, అవి కూడా త్వరలోనే విడుదలవుతాయని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

38 తిరుమల దర్శనానికి 30 గంటల సమయం

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్:
కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు తిరుమల గిరులకు పోటెత్తారు. వారాంతానికి ముందే భక్తుల తాకిడి అనూహ్యంగా పెరగడంతో తిరుమల కొండ కిటకిటలాడుతోంది. దీంతో శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 24 నుంచి 30 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు.భక్తుల రద్దీ కారణంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. దీంతో క్యూ లైన్లు బయట వరకు బారులు తీరాయి. గోగర్భం డ్యామ్ సర్కిల్ సమీపంలోని ఆక్టోపస్ భవనం వరకు భక్తులు శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు.భక్తుల రద్దీ దృష్ట్యా, యాత్రికులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్రణాళిక చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.నిన్న గురువారం (జూలై 16) ఒక్కరోజే 63,556 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 35,900 మంది తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీ ఆదాయం రూ. 5.31 కోట్లుగా నమోదైంది. టీటీడీ అధికారులు 4.12 లక్షల లడ్డూలను విక్రయించగా, 2.55 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందించారు. అలాగే, 4,051 మంది భక్తులకు వైద్య సేవలు అందించినట్లు టీటీడీ తెలిపింది.

40గిరిజన సంక్షేమ అధికారి జాదవ్ అంబాజీకి ఘన సన్మానం

హైదరాబాద్, జూలై 18 పెన్ పవర్: కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా గిరిజన సంక్షేమ శాఖకు నూతనంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారిగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించిన జాదవ్ అంబాజీని టీఎస్‌టి బ్యూటీయూ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతల సందర్భంగా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆయన సమర్థవంతమైన నాయకత్వం అందిస్తారని ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా జాదవ్ అంబాజీ మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో గిరిజన సంక్షేమ శాఖ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని, విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు శాఖ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో పి ఏం ఆర్ సి ఏ సి ఏం ఓ పూర్కా ఉద్ధవ్, జి సి డి ఓ కొట్నాక్ శకుంతల, జిల్లా క్రీడా అధికారి మడావి శేఖు, ఏ టి డి ఓలు చిరంజీవి, భాస్కర్, టీఎస్‌టి బ్యూటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి అశోక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నైతం కృష్ణ రావ్, సంఘం అధ్యక్షులు కొట్నాక్ యాదవరావ్, జిల్లా అధ్యక్షుడు
రాథోడ్ రవీందర్, ప్రధాన కార్యదర్శి మడావి గోపాల్, జిల్లా కార్యవర్గ సభ్యులు కోడెం రవీందర్, కుడ్మేత అనంత్, వెడ్మ యశ్వంత్ రావ్, మడావి పోచాని, షెడ్మాకీ వెంకటేష్, బండ మీనారెడ్డి, చాకిలం మధు, చంద్రశేఖర్ పవార్ లింబారావ్, కుడ్మేత జంగు, నందారాం, మడావి లచ్చు తో పాటు గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలిపారు.

ముద్రగడ ఫ్యామిలీ ఫ్యూచర్ ఏంటీ

కాకినాడ, జూలై 17 పెన్ పవర్:
దశాబ్దాల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తన సంచలన నిర్ణయాలతో, సుదీర్ఘ సామాజిక పోరాటాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నేత ముద్రగడ పద్మనాభం మృతితో ఒక సుదీర్ఘ అధ్యాయం ముగిసింది. అయితే, ఆయన జీవిత చరమాంకంలో, అంత్యక్రియల వేళ కూడా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నడిపిన రాజకీయ వ్యూహాలు ఆయన కుటుంబానికి కనీస ప్రశాంతత లేకుండా చేశాయి. జీవించి ఉన్నంత కాలం ముద్రగడ చేత సుదీర్ఘ లేఖలు రాయించి, తమ పొలిటికల్ అజెండా కోసం ఆయన ఇమేజ్‌ను వాడుకున్న వైసీపీ.. ఇప్పుడు ఆయన లేని తరుణంలో ఆ కుటుంబాన్ని పట్టించుకుంటుందా అన్న చర్చ నడుస్తంది.గత ఎన్నికల ముందు ముద్రగడ పద్మనాభం వైసీపీలో చేరిన నాటి నుండి, ఆయనను పూర్తిగా ప్రత్యర్థులపై విమర్శలు గుప్పించే ఒక రాజకీయ ఆయుధంగానే అధినాయకత్వం వాడుకుందనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. కూటమి నేతలపై లేఖల అస్త్రాలు సంధించడానికి, కుల సమీకరణలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి నాటి అధికార పార్టీ ఆయనకు ప్రాధాన్యతనిచ్చింది. కానీ, ఇప్పుడు ఆయన భౌతికంగా లేరు. ముద్రగడ రాజకీయ వారసత్వాన్ని మోయాల్సిన ఆయన కుమారుడు గిరిబాబు ప్రస్తుతానికి రాజకీయంగా అంత యాక్టివ్‌గా లేరు, పైగా ఆర్థికంగానూ పటిష్టమైన స్థితిలో లేరనే గుసగుసలు కిర్లంపూడి వర్గాల్లో బలంగా వినిపిస్తున్నాయి. ఇలాంటి బలహీనమైన తరుణంలో వైసీపీ ఆ కుటుంబాన్ని ఎంతవరకు ఆదుకుంటుందనేది పెద్ద ప్రశ్నార్థకమే.వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయ శైలిని దగ్గరుండి గమనించిన ఎవరికైనా ఒక విషయంపై పూర్తి స్పష్టత ఉంటుంది. తమకు రాజకీయంగా

అవసరం ఉన్నంత కాలమే ఎవరికైనా రెడ్ కార్పెట్ పరుస్తారని, ఒకసారి ఆ అవసరం తీరిపోయాక వారిని కరివేపాకులా తీసిపారేస్తారనే విమర్శలు పార్టీలోనే బలంగా ఉన్నాయి. గతంలో పార్టీ కోసం కష్టపడిన ఎందరో సీనియర్ల కుటుంబాలను జగన్ రెడ్డి ఎలా పక్కన పెట్టారో ఉదాహరణలు కళ్లముందే ఉన్నాయి. ఇప్పుడు ముద్రగడ కుటుంబం విషయంలోనూ ఇదే రిపీట్ కాబోతోందని, జగన్ కానీ, వైసీపీ టాప్ లీడర్‌షిప్ కానీ ఇకపై ముద్రగడ కుటుంబాన్ని పెద్దగా పట్టించుకునే ప్రసక్తే లేదని అంటున్న్లు.ప్రస్తుతానికి ముద్రగడ మృతి పట్ల వైసీపీ నేతలు సానుభూతి ప్రకటిస్తున్నప్పటికీ, రాబోయే రోజుల్లో వారి అసలు రంగు బయటపడుతుందని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి ముద్రగడ వారసులకు అసెంబ్లీ లేదా పార్లమెంట్ టిక్కెట్ ఇచ్చే ఉద్దేశం జగన్ మోహన్ రెడ్డికి అస్సలు లేదు. కష్టకాలంలో
జెండా మోసేవారికే దిక్కులేని వైసీపీలో, కేవలం ఎన్నికల ముందు వచ్చి చేరిన సీనియర్ నేత కుటుంబానికి భవిష్యత్తు సీట్ల కేటాయింపుల్లో అగ్రతాంబూలం ఇస్తారని అనుకోవడం ముమ్మాటికీ అమాయకత్వమే అవుతుంది. ఇప్పుడున్న సానుభూతి పవనాలు చల్లారిన తర్వాత, సరిగ్గా మరో ఆరు నెలలకో లేదా ఏడాదికో ముద్రగడ కుటుంబానికి వైసీపీలో ఎలాంటి ప్రాధాన్యత దక్కుతుందో, ఎన్ని అవమానాలు ఎదురవుతాయో అందరూ ప్రత్యక్షంగా చూస్తారని వేసీపీ నేతలే జోస్యం చెబుతున్నారు

కూటమికి టిక్కెట్ల సవాల్

విజయవాడ, జూలై 18 పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్ రాజకీయం మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికలు సమయం దగ్గర పడుతోంది. ఈ సారి ఎన్నికల బరిలో అధికార కూటమి ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాల్ ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కాదు.. ఆయా పార్టీల మధ్య సమన్వయమే. సార్వత్రిక ఎన్నికల్లో లభించిన క్లీన్ స్వీప్ విజయం తర్వాత, క్షేత్రస్థాయిలో కూటమి గ్రాఫ్ బలంగా ఉంది. వైసీపీ రక్షణాత్మక ధోరణిలో ఉండటంతో, తాము గెలుపు గుర్రాలమనే ధీమా కూటమి నేతల్లో అత్యధికంగా ఉంది. ఫలితంగా, అసలు పోటీ ప్రతిపక్షంతో కాదని, టిక్కెట్ల కోసం తమలో తామే పోటీ పడాల్సి ఉంటుందని కూటమి అగ్రనాయకత్వానికి ముందే అర్థమైంది. కింది స్థాయి నేతలంతా తామంటే తామే పోటీ చేస్తామని ఎగబడుతుండటంతో సీట్ల పంపకం, సమన్వయం అనేది ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది.ఈ అంతర్గత పోటీని, అసమ్మతిని ముందే పసిగట్టిన కూటమి పెద్దలు అప్రమత్తమయ్యారు. ఎక్కడికక్కడ మున్సిపల్ వార్డులు, ఎంపీటీసీ స్థానాల వారీగా ఏ పార్టీ ఏ స్థానంలో పోటీ చేయాలనే దానిపై ఓ స్పష్టత తెచ్చేందుకు తెరవెనుక ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించారు. గత ఎన్నికల ఓట్ల శాతం, స్థానిక బలాబలాలు , ఇరు పార్టీల నేతల అంగీకారం ఆధారంగా ఒక స్థూల ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. ఈ చర్చలు ప్రాథమికంగా ఒక కొలిక్కి రావడంతోనే ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఏ ఒక్క స్థానంలో కూడా ఓట్ల చీలిక రాకుండా, పరస్పరం సహకరించుకునేలా కింది స్థాయి క్యాడర్‌ను మానసికంగా సిద్ధం చేస్తున్నారు.మరోవైపు, జనసేన పార్టీలో ఈ ఎన్నికల కోసం ప్రత్యేకంగా గ్రౌండ్ వర్క్ నడుస్తోంది. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ కూడా కూటమి సమన్వయంపై గట్టి సంకేతాలే ఇచ్చారు. కూటమి శ్రేణుల మధ్య ఐక్యత మిస్ కాకూడదని, సీట్ల సర్దుబాటులో ఒకరికొకరు గౌరవం ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అంతేకాకుండా, గత ఐదేళ్లుగా పార్టీ కోసం నిలబడి, జెండా మోసి కష్టపడిన నిజమైన జనసైనికులకు ఈ స్థానిక ఎన్నికల్లో సముచిత స్థానం కల్పించేలా జనసేన అధిష్టానం ఇప్పటికే అంతర్గతంగా సమాచార సేరణ పూర్తి చేసింది. పార్టీ గెలిచే అవకాశాలు ఉన్న స్థానాల జాబితాను సిద్ధం చేసి, చంద్రబాబుతో సీట్ల సర్దుబాటు చర్చలకు పక్కా వ్యూహంతో సిద్ధమైంది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల వార్డుల స్థాయిలో గెలుపు అవకాశాలు ఎక్కువగా ఉండటంతో, క్షేత్రస్థాయి నేతల్లో ఆశావహుల సంఖ్య వేలల్లో ఉంది. సీటు దక్కని పక్షంలో తిరుగుబాటు అభ్యర్థులుగా బరిలోకి దిగే ప్రమాదం కూడా లేకపోలేదు. అలాంటి చోట్ల ఆశావాహులను బుజ్జగించి, కూటమి క్రమశిక్షణను కాపాడటంలోనే మూడు పార్టీల సమన్వయకర్తల అసలు పరీక్ష దాగి ఉంది. ఏదేమైనా, ఈ లోకల్ బాడీ ఎన్నికలను విజయవంతంగా ముగించి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకోవాలని కూటమి భావిస్తుండటంతో, సీట్ల పంపకాల వ్యూహం కీలకం కానుంది.

15 తర్వాత మున్సిపల్ ఎన్నికలు

ధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర కసరత్తు ప్రారంభించింది. రాష్ట్రంలో ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన స్థానిక సంస్థలకు వీలైనంత త్వరగా ఎన్నికలు పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలోనే రాబోయే సెప్టెంబర్ నెలలోనే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం , ఎన్నికల సంఘం ఒక పక్కా ప్రణాళికను సిద్ధం చేశాయి.ఎన్నికల నిర్వహణ వ్యూహంలో భాగంగా ప్రభుత్వం ఒక కీలక నిర్ణయానికి వచ్చింది. రాష్ట్రంలో ఒకేసారి కాకుండా విడతలవారీగా ఎన్నికలను జరపాలని భావిస్తోంది. ఇందులో భాగంగా

తొలుత పట్టణ ప్రాంతాల్లోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించేందుకు మొగ్గు చూపుతోంది. ఆ తర్వాత గ్రామీణ పరిధిలోకి వెళ్తూ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను పూర్తి చేయాలని ప్రణాళిక రచించింది. ఈ రెండు దశలు ముగిసిన అనంతరం ఆఖరిగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వెళ్లాలనేది ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది.జూలై 27వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల పాటు సుదీర్ఘంగా డోర్ టూ డో కార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీ అధిష్ఠానం క్యాడర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మున్సిపల్ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడమే లక్ష్యంగా పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తోంది. స్థానిక సమరానికి ముందే పార్టీ నేతల్లో అసంతృప్తిని చల్లార్చేందుకు కూటమి సర్కార్ అడుగులు వేస్తోంది. గత కొన్నాళ్లుగా పెండింగ్‌లో ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియను అత్యంత వేగంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. పదవులు దక్కిన నేతలు మరింత ఉత్సాహంతో క్షేత్రస్థాయిలో పార్టీ విజయానికి కృషి చేస్తారనే నమ్మకంతో ఉన్నారు.

పోలవరానికి పర్యాటక శోభ

రాజమండ్రి, జూలై 18 పెన్ పవర్:
ఆంధ్రప్రదేశ్‌లో పోలవరానికి పర్యాటక శోభను తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రణాళికలు రచిస్తోంది. పోలవరం డ్యామ్‌తోపాటు గోదావరి నదీ తీరాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిపెట్టారు. ఇందులో భాగంగా ప్రాజెక్టు ప్రాంతంతోపాటు ప్రాజెక్టు దిగువన, ఎగువన టూరిజం డెవల్మెంట్‌కు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. ఈ అంశంపై సీఎం క్యాంప్ కార్యాలయంలో ఇరిగేషన్, టూరిజం శాఖ అధికారలుతో పాటు ఏజెన్సీలతో ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. నదీతీరం వెంట టూరిజం ప్రాజెక్టులతో ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ప్రాజెక్టు వద్ద కేబుల్ బ్రిడ్జ్ డిజైన్, స్పిల్ వే బ్యూటిఫికేషన్ సహా మాస్టర్ ప్లాన్‌పై చర్చించారు. టూరిజం ప్రాజెక్టుల అభివృద్ధిలో అనుభవం ఉన్న నిప్పాన్ కోయి సంస్థ ప్రతినిధులు ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. పోలవరం ప్రాజెక్టు సమీపంలో నదికి ఇరువైపులా పర్యాటక ప్రాజెక్టులు ఏర్పాటుపై చర్చించారు.పోలవరం ప్రాజెక్టు ఎగువున భద్రాచలం సమీపం వరకు ఏపీ భూభాగంలో టూరిజం అభివృద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అభిప్రాయపడ్డారు. సమృద్ధిగా నీటి వనరులు, పచ్చని కొండలు, అటవీ ప్రాంతాలతో మంచి పర్యాటక ప్రాంతంగా పోలవరం మారుతుందని సీఎం అన్నారు. ఎకో టూరిజం, రాక్ క్లైంబింగ్, వెల్‌నెస్ సెంటర్స్, డెస్టినేషన్ వెడ్డింగ్స్ వంటి వాటికి అనుకూలంగా మార్చాలని సీఎం సూచించారు. ఈ నేపథ్యంలో పలు ప్రాజెక్టులు చేపట్టడం ద్వారా పర్యాటక రంగంలోనూ పోలవరాన్ని ప్రత్యేకంగా నిలపేలా చేయాలన్నారు.ఇంజనీరింగ్ టూరిజం, రివర్ ఫ్రంట్ టూరిజం, అడ్వెంచర్ టూరిజం డెవల్మెంట్‌కు ఈ ప్రాంతం అత్యంత అనుకూలమన్న ఏజెన్సీ.. వాటర్ స్పోర్ట్స్‌కు సమృద్ధిగా అవకాశాలు ఉన్నాయని వివరించింది. స్పిల్ వే దిగువన నది మధ్యలో 500 ఎకరాల ఐ లాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసే విషయంలో పలు డిజైన్లు ప్రతిపాదనలను అందించారు. అలాగే మధ్యలో ఉండే వాటర్ బాడీలు, కొండలను పర్యాటక ప్రాంతాలుగా మార్చేందుకు ఉన్న అవకాశాలను సంస్థ ప్రతినిధులు వివరించారు. స్పిల్ వే దిగువన కేబుల్ బ్రిడ్జ డిజైన్లపైనా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఐలాండ్‌గా ఉన్న ప్రాంతంతో పాటు చుట్టుపక్కల మొత్తం 1,500 ఎకరాల్లో తీసుకురాదగిన ప్రాజెక్టులపై నిప్పాన్ కోయి సంస్థ ప్రజెంటేషన్‌లో పలు ప్రతిపాదనలు చేసింది.ప్రాజెక్టుతో లక్షల ఎకరాలకు నీరు ఇవ్వడంతో పాటు...పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం ద్వారా రాష్ట్రానికి ఆదాయం వస్తుందని, స్థానికంగా ఎంతోమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం పలు సూచనలు చేశారు. అఖండ గోదావరి ప్రాజెక్టు కింద ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున పర్యాటక ప్రాజెక్టులు తీసుకువస్తామని సీఎం స్పష్టం చేశారు. అధికారులు ఆమేరకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

ఎలాన్ మస్క్ 'టెస్లా'.. అమ్మకాలు ధమాల్.. మూసుకోవాల్సిందే

హైదరాబాద్ పెన్ పవర్: లాన్ మస్క్ సంస్థ టెస్లా భారత్‌లోకి భారీ అంచనాల మధ్య అడుగుపెట్టినప్పటికీ, తొలి ఏడాదిలో ఆశించిన ఫలితాలను అందుకోలేకపోయినట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. భారత మార్కెట్‌లోకి టెస్లా అధికారికంగా ప్రవేశించి ఈ నెల 15తో ఏడాది పూర్తయింది. అయితే అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించిన ఈ ఒక సంవత్సర కాలంలో కంపెనీ కేవలం 450 కార్లను మాత్రమే విక్రయించినట్లు సమాచారం. గ్లోబల్ మార్కెట్లను శాసిస్తున్న టెస్లాకు భారత మార్కెట్‌లో ఇలాంటి ఆరంభం లభించడం ఆటోమొబైల్ రంగాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది.

భారీ ధర.. మందగించిన అమ్మకాలు

టెస్లా భారత్‌లో ప్రస్తుతం మోడల్ 'వై'ను మాత్రమే విక్రయిస్తోంది. ఈ ప్రీమియం మోడల్‌ను భారత వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చినా.. అధిక ధర కారణంగా కొనుగోలుదారుల నుంచి ఆశించిన స్పందన లభించలేదని మార్కెట్ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రారంభ ధర ?59.89 లక్షలు (ఎక్స్‌షోరూమ్)గా ఉండగా తగ్గించిన ధర ?50.89 లక్షలుగా ఉంది. భారత్‌లో అమ్మకాలు ఆశించిన స్థాయిలో సాగకపోవడంతో మే 2026లో కంపెనీ ఏకంగా రూ. 9 లక్షల వరకు ధరను తగ్గించింది. అయినప్పటికీ విక్రయాల్లో పెద్దగా పురోగతి కనిపించలేదని మార్కెట్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

టెస్లాకు సవాల్‌గా మారిన అంశాలు

టెస్లా విక్రయాలు ఊపందుకోకపోవడానికి ఆటోమొబైల్ నిపుణులు పలు ప్రధాన కారణాలను విశ్లేషిస్తున్నారు. భారత్‌లో ప్రస్తుతం టెస్లా వాహనాలను పూర్తిగా విదేశాల నుండి దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. దీనివల్ల పన్నుల భారం పడి వాహనాల ధరలు సామాన్యులకు, మధ్యతరగతికి అందనంత ఎత్తుకు చేరాయి. భారత ఈవీ మార్కెట్‌లో ఇప్పటికే టాటా మోటార్స్, మహీంద్రా, ఎంజీ మోటార్, బీవైడీ వంటి కంపెనీలు విభిన్న ధరల శ్రేణిలో బడ్జెట్ ఫ్రెండ్లీ నుండి ప్రీమియం వరకు కార్లను అందుబాటులో ఉంచాయి. ఇది టెస్లాకు పెద్ద సవాల్‌గా మారింది. భారత వినియోగదారులు ధరకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు విస్తృత సర్వీస్ నెట్‌వర్క్, ఛార్జింగ్ మౌలిక వసతులు, విడిభాగాల లభ్యతను కీలకంగా పరిగణిస్తారు. ఈ విషయాల్లో దేశీయ సంస్థలకు ఉన్న పట్టు టెస్లాకు ఇంకా లభించలేదు.

భవిష్యత్తు వ్యూహంపైనే ఆశలు

భారత ఈవీ మార్కెట్ చాలా వైవిధ్యమైనది. ఇక్కడ కేవలం బ్రాండ్ ఇమేజ్ మాత్రమే సరిపోదు, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా వ్యూహాలు మార్చుకోవాలని ఆటోమొబైల్ నిపుణులు హెచ్చరిస్తున్నారు.
తొలి ఏడాది నిరాశపరిచినప్పటికీ భారత మార్కెట్‌ను టెస్లా దీర్ఘకాలిక అవకాశాల దృష్ట్యా ఎంతో కీలకంగా చూస్తోంది. భవిష్యత్తులో భారత్‌లోనే స్థానిక తయారీ యూనిట్ ఏర్పాటు చేయడం లేదా భారత్ కోసమే ప్రత్యేకంగా తక్కువ ధర కలిగిన మరిన్ని మోడళ్లను ప్రవేశపెట్టడం ద్వారా ధరలను తగ్గించేందుకు మస్క్ బృందం యోచిస్తోంది.మొత్తానికి ప్రపంచవ్యాప్తంగా సక్సెస్‌ఫుల్ ఈవీ బ్రాండ్‌గా పేరుగాంచిన టెస్లాకు భారత మార్కెట్‌లో తొలి ఏడాది మాత్రం 'స్పీడ్ బ్రేకర్' లాంటి అనుభవాన్నే మిగిల్చింది. రాబోయే రోజుల్లో స్థానిక ఉత్పత్తి, సరసమైన ధరలతో వస్తేనే టెస్లా ఇండియాలో దూసుకుపోయే అవకాశం ఉంది.

ఖరీఫ్ ఆశల గల్లంతు

కర్నూలు జూలై 18 పెన్ పవర్: ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం ఎప్పటి నుంచో వెన్నెముకగా నిలుస్తోంది. రాష్ట్ర విభజన తర్వాత ఐటీ , పారిశ్రామిక రంగాల అభివృద్ధిపై ప్రభుత్వాలు దృష్టి పెట్టినా, ఇప్పటికీ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రధాన ఆధారం వ్యవసాయమే. అయితే ఈ ఏడాది ఎల్ నినో (ప్రభావంతో రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. పంటల సాగు ప్రారంభం కావాల్సిన సమయంలోనే వానలు లేకపోవడంతో ఖరీఫ్ సీజన్‌పై అనిశ్చితి నెలకొంది.సాధారణంగా నైరుతి రుతుపవనాలు జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశిస్తాయి. ఈసారి ప్రారంభంలో అక్కడక్కడా స్వల్ప వర్షాలు కురిసినా, ఆ తర్వాత వర్షాలు దాదాపు పూర్తిగా నిలిచిపోయాయి. గత నెలన్నర కాలంలో రాష్ట్రానికి రావాల్సిన వర్షపాతం కంటే సుమారు 49 శాతం తక్కువ వర్షం మాత్రమే నమోదవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. సగటున 170.3 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా కేవలం 86.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.ముఖ్యంగా రాయలసీమ ప్రాంతం తీవ్ర కరవుతో అల్లాడుతోంది. జూలై తొలి పదిహేను రోజుల్లో దాదాపు 94 శాతం వరకు వర్షపాతం లోటు నమోదవడం అక్కడి రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టింది. అదే సమయంలో కోస్తా ఆంధ్ర జిల్లాల్లో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదు. అక్కడ కూడా సాధారణ స్థాయితో పోలిస్తే దాదాపు 70 శాతం తక్కువ వర్షం కురిసింది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ఏ ఒక్క జిల్లాలోనూ సాధారణ వర్షపాతం నమోదు కాకపోవడం పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో చెప్పకనే చెబుతోంది.రాష్ట్రంలోని 676 మండలాల్లో అధిక శాతం ప్రాంతాలు వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నాయి. దీంతో భూగర్భ జలాల మట్టం వేగంగా పడిపోతోంది. బోర్లు ఎండిపోవడం, చెరువులు నీరు కోల్పోవడం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్ స్థాయికి చేరుకోవడం రైతుల్లో మరింత ఆందోళన పెంచుతోంది.ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసే వరి, వేరుశనగ, పత్తి, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ఈసారి తీవ్ర ప్రభావానికి గురయ్యే అవకాశం కనిపిస్తోంది. వర్షాలు లేకపోవడం మాత్రమే కాకుండా, అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతుండటంతో విత్తనాలు వేయడానికి కూడా రైతులు వెనుకంజ వేస్తున్నారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో సాగు పనులు నిలిచిపోయాయి. ఈ పరిస్థితి కొనసాగితే వ్యవసాయ ఉత్పత్తిపై మాత్రమే కాకుండా గ్రామీణ ఉపాధి, రైతుల ఆదాయం, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడే అవకాశం ఉంది.
వాతావరణ పరిస్థితులు త్వరగా మారి జూలై రెండో పక్షంలో అయినా మంచి వర్షాలు కురిస్తే కొంతవరకు పరిస్థితి మెరుగుపడే అవకాశముందని వ్యవసాయ నిపుణులు భావిస్తున్నారు. లేకపోతే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ రైతులకు తీవ్ర నిరాశను మిగిల్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని రైతు సంఘాలు సూచిస్తున్నాయి.

టీడీపీలోకి వాసిరెడ్డి...

విజయవాడ జూలై 18 పెన్ పవర్: వైసీపీ నుంచి బయటకు వచ్చిన మహిళా నాయకురాలు.. వాసిరెడ్డి పద్మకు పొలిటికల్‌గా లైన్ క్లియర్ అయినట్టు తెలుస్తోంది. తాజాగా మంత్రి నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. దీంతో త్వరలోనే ఆమె టీడీపీ కండువా కప్పుకొనే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ప్రతి విషయంలోనూ దూకుడుగా ఉండే వాసిరెడ్డి పద్మ దాదాపు 20 ఏళ్లకుపైగానే రాజకీయాల్లో కొనసాగుతున్నారు.వైసీపీ అధికార ప్రతినిధిగా.. ఆ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత.. మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా వ్యవహరించారు. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని ఓ నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని భావించినా.. జగన్ ఆమెకు అవకాశం ఇవ్వలేదు. దీంతో అప్పటి ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఎన్నికల అనంతరం.. వైసీపీ నుంచి బయటకు వచ్చిన పద్మ.. సంచలన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. జగన్ కారణంగానే అందరూ ఓడిపోయారని అన్నారు. పార్టీని నడిపించడం.. నాయకులను సమన్వయం చేయడం కూడా రాదని పద్మ వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే వైసీపీ నుంచి బయటకు వచ్చిన ఆమె.. అప్పటి నుంచి ఏ పార్టీలోనూ చేరకుండా మౌనంగా ఉన్నారు. సుమారు ఏడాదిన్నరగా మౌనంగా ఉన్న పద్మ.. తాజాగా టీడీపీలో చేరనున్నట్టు తెలుస్తోంది. పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేష్‌తో ఆమె భేటీ అయ్యారు. ఆయన పనితీరు, మంత్రి వర్గంలో వ్యవహరిస్తున్న తీరునుకొనియాడారు.అయితే.. ఇప్పటికిప్పుడు వాసిరెడ్డి చేరికపై పార్టీలో ఎలాంటి ప్రకటన రాలేదు. త్వరలోనే దీనిపై క్లారిటీ వస్తుందని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పద్మకు అవకాశం దక్కుతుందని పార్టీ నాయకులు చెబుతున్నారు. పైగా వచ్చే ఎన్నికల నాటికి మహిళలకు ప్రాధాన్యం పెరుగుతున్న దరిమిలా వాసిరెడ్డికి టీడీపీ తరఫున పోటీ చేసేందుకు కూడా మంచి అవకాశం చిక్కే పరిస్థితి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

మావిగన్ జగన్ కాదట... వెనక ఆ పార్టీ ఉందట !

హైదరాబాద్ పెన్ పవర్: మావిగన్ అని కొత్త సూత్రీకరణ చేశారు వైసీపీ అధినేత వైఎస్ జగన్. అయితే మావిగన్ అన్నది జగన్ సొంత ఆలోచన కాదని దాని వెనక ఒక బడా పార్టీ ఉందని కాంగ్రెస్ కి చెందిన సీనియర్ నాయకుడు మాజీ ఎంపీ హర్ష కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ప్రత్యేక హోదాను లేకుండా చేయడానికి ఏపీ శాశ్వతంగా అడగకుండా చూడడానికే మావిగన్ పేరుతో కొత్త నాటకం అని ఆయన అంటున్నారు.

రాజధాని విషయంలోనూ :

ఇదిలా ఉంటే ఏపీ రాజధాని విషయంలో అటు చంద్రబాబు ఇటు జగన్ ఇద్దరూ రాజకీయ నాటకం ఆడుతున్నారని హర్షకుమార్ విమర్శించారు. ఏపీకి సంజీవిని లాంటి ప్రత్యేక హోదాను ఈ రెండు ప్రాంతీయ పార్టీలు పూర్తిగా పక్కన పెట్టేశాయని, పైగా బీజేపీ డైరెక్షన్ లో నడుస్తూ రాజధాని విషయంలో వారు చెప్పినట్లే వ్యవహరిస్తున్నాయని ఆయన అంటున్నారు. మావిగన్ పేరుతో కేవలం విజయవాడ మచిలీపట్నం, గుంటూరులను అభివృద్ధి చేస్తే సరిపోతుందా అని ఆయన ప్రశ్నించారు. అలాగే టీడీపీ కూడా అమరావతిలోనే ఈ ప్రాంతాలు ఉన్నాయని చెబుతోంది అని ఆయన గుర్తు చేశారు. ఈ విధంగా అభివృద్ధి కేంద్రీకరణ వల్ల ఏపీకి ఏమి ఒరుగుతుందని ఆయన నిలదీశారు.

బీజేపీ తెర వెనక :

ప్రత్యేక హోదా డిమాండ్ ని పూర్తిగా లేకుండా చేయడానికి బీజేపీ తెర వెనక ఉంటూ మావిగన్ వంటి ప్రతిపాదనలు చేయిస్తోంది అని ఆయన మండిపడ్డారు. ఇది బీజేపీ రూపొందించిన అలాగే ప్రాంతీయ నాయకుల ద్వారా అమలు చేయబడిన ఒక మోసపూరిత ప్రణాళికగా హర్షకుమార్ అభివర్ణించారు. ఏపీకి బీజేపీ ద్రోహం చేసింది అని ఆయన అన్నారు. ఏపీ ఆర్థిక ప్రయోజనాలు అన్నీ కూడా ప్రత్యేక హోదా వంటి వాటితో ముడిపడి ఉన్నాయని ఆయన అంటున్నారు. అయితే వాటి నుంచి తప్పించేందుకు రాజకీయ పెయిన్ కిల్లర్ లాంటి ఒక ఫార్ములాయే మావిగన్ ఫార్ములా అని హర్ష కుమార్ అభివర్ణించారు.

చిన్న ప్రాంతానికే అభివృద్ధి :

కేంద్ర బీజేపీ నాయకత్వం ఆదేశాల మేరకే ఏపీలో టీడీపీ వైసీపీ జనసేన పనిచేస్తున్నాయని ఆయన ఫైర్ అయ్యారు. రాష్ట్రంలోని అభివృద్ధిని అంతా ఒక చిన్న కేంద్ర ప్రాంతానికే పరిమితం చేయాలన్నదే ఈ ఎత్తుగడ అని హర్ష కుమార్ వివరించారు. ప్రధాన పార్టీలు అన్నీ ప్రత్యేక హోదా కోసం పోరాడటానికి బదులుగా ఇలాంటి ప్రతిపాదనలు చేయడమేంటి అని ఆయన ప్రశ్నించారు. ఏపీకి ప్రత్యేక హోదా వస్తే దాని ద్వారా అన్ని జిల్లాల సమగ్ర అభివృద్ధి జరుగుతుందని అన్నారు. అలాంటి హోదాకు పోరాడే బదులు ప్రజల డిమాండ్లను అణచివేసేందుకు ప్రాంతీయ పార్టీలు మావిగన్ ఫార్ములాను ఒక తాత్కాలిక పరిష్కారంగా చూపిస్తున్నాయని ఆయన ఫైర్ అయ్యారు.

దానికి సాటి రాదు :

ఇక ప్రత్యేక హోదా అంటే ఏపీ సర్వతోముఖాభివృద్ధి అని హర్షకుమార్ అన్నారు. పూర్తి స్థాయి ప్రత్యేక హోదాతో లభించే ఆర్థిక ప్యాకేజీలు, పారిశ్రామిక రాయితీలు పన్ను మినహాయింపులతో ఏపీ అన్ని విధాలుగా బాగుపడుతుందని అన్నారు. అయితే దానికి బదులుగా కేవలం కొన్ని ఎంపిక చేసిన నగరాల్లో మౌలిక సదుపాయాల కల్పన ఏపీకి ఏ మాత్రం ప్రత్యామ్నాయం కాదని మాజీ అమలాపురం ఎంపీ వాదిస్తున్నారు. ఇలాగైతే వెనకబడిన ఉత్తరాంధ్రా, రాయలసీమ వంటి ప్రాంతాల సంగతి ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. బీజేపీ ప్రత్యేక హోదా డిమాండ్‌ను పూర్తిగా నీరు గార్చడానికి ఆంధ్రప్రదేశ్‌ను ఆర్థికంగా కేంద్రంపై ఆధారపడేలా చేయడానికి ప్రాంతీయ పార్టీలను వాడుకుంటోందని హర్ష కుమార్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం నిలకడగా పోరాడుతున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన స్పష్టం చేస్తున్నారు.

మరో ఏడాదిలో ఏఐ మనుషుల్ని దాటేస్తుందా? ఆంత్రోపిక్ సీఈవో మాటల్లో నిజమెంత?

హైదరాబాద్ పెన్ పవర్: ఆంత్రోపిక్ సంస్థ సీఈవో డారియో అమోడీ ఇటీవలే "మరో ఏడాదిలో ఏఐ మనుషుల్ని దాటేస్తుంది. 2030 నాటికి సగం వైట్-కాలర్ ఉద్యోగాలు మాయమవుతాయి. ఆంత్రోపిక్ చీఫ్ ఇంజనీర్ రెండు నెలలుగా ఒక్క లైన్ కోడ్ కూడా రాయలేదు" అంటూ వ్యాఖ్యానించడం సాఫ్ట్ వేర్ రంగంలో గుబులు రేకెత్తించింది.. అయితే ఈ ప్రచారంలో ఎంతవరకు నిజముంది? కాస్త లోతుగా పరిశీలిస్తే ఇందులో కొన్ని నిజాలు, మరికొన్ని అర్ధసత్యాలు ఉన్నట్లు స్పష్టమవుతోంది.

మనల్ని అధిగమించడానికి 1-2 ఏళ్లే.. ఇది నిజమేనా?

అవును ఇది నిజమే. 2026 జనవరిలో డారియో అమోడీ రాసిన "సాంకేతికత కౌమారదశ" అనే సుదీర్ఘ వ్యాసంలో ఈ విషయాలను ప్రస్తావించారు. 2027 నాటికే నోబెల్ గ్రహీతల కంటే తెలివైన ఏఐ వ్యవస్థలు రావొచ్చని, మానవ మేధస్సును ఏఐ దాటేయడానికి కేవలం ఒకటి రెండేళ్ల సమయం మాత్రమే ఉందని ఆయన అంచనా వేశారు. అయితే ఇది పరిశ్రమలో అందరి అభిప్రాయం కాదు. గూగుల్ డీప్‌మైండ్ సీఈవో డెమిస్ హసాబిస్ దీనిపై స్పందిస్తూ... ఈ దశాబ్దంలో మనిషి స్థాయి ఏఐ వచ్చే అవకాశం 50% మాత్రమే ఉందని చాలా జాగ్రత్తగా మాట్లాడారు. అమోడీ నడుపుతున్న ఆంత్రోపిక్ కంపెనీ విలువ ప్రస్తుతం 350 బిలియన్లు కావడంతో తన ఉత్పత్తుల మార్కెటింగ్ కోసమే ఆయన ఇలాంటి హైప్ క్రియేట్ చేస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

2030 నాటికి సగం ఎంట్రీ-లెవెల్ ఉద్యోగాలు మాయం?

ఈ వ్యాఖ్య కూడా అమోడీ చేసినదే. 2025 మే నెలలో యాక్సియోస్ ఇంటర్వ్యూలోనూ ఆ తర్వాత 2026 ఫిబ్రవరిలోనూ ఆయన ఈ హెచ్చరికను పునరుద్ఘాటించారు. వచ్చే ఐదేళ్లలో ఎంట్రీ-లెవెల్ వైట్-కాలర్ ఉద్యోగాల్లో 50% వరకు తగ్గిపోవచ్చని.. నిరుద్యోగం 10-20% పెరగొచ్చని ఆయన పేర్కొన్నారు.

దీనికి మద్దతుగా కొన్ని గణాంకాలు కూడా ఉన్నాయి. 'సిగ్నల్‌ఫైర్' నివేదిక ప్రకారం బిగ్ టెక్ కంపెనీల్లో ఫ్రెషర్స్ నియామకాలు దాదాపు 50% తగ్గాయి. అయితే ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ వంటి ప్రముఖులు దీనిని వ్యతిరేకిస్తున్నారు. ఏఐ వల్ల ఉత్పాదకత పెరుగుతుందే తప్ప ఉద్యోగాలు పోవని వారి వాదన. అలాగే కంపెనీలు తమ అంతర్గత కారణాలతో చేసే లేఆఫ్‌లను కూడా ఏఐ పైకి నెట్టేస్తున్నాయని నిపుణులు చెప్తున్నారు. క్లాడ్ కోడ్ విభాగానికి నేతృత్వం వహిస్తున్న బోరిస్ చెర్నీ 2026 జూన్ ఫార్చ్యూన్ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. తాను దాదాపు ఎనిమిది నెలలుగా చేతితో ఒక్క లైన్ కోడ్ కూడా రాయలేదని, వందల సంఖ్యలో ఏఐ ఏజెంట్లను నిర్వహించడమే తన పని అని చెప్పారు. అంటే ఇక్కడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పని పూర్తిగా పోలేదు, కేవలం కోడింగ్ రాసే విధానం మారి ఏఐ ఏజెంట్లను మేనేజ్ చేసే స్థాయికి రూపాంతరం చెందింది.

ఆందోళనా? మార్కెటింగా?

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ మూడు వ్యాక్యాలలో మొదటి రెండు డారియో అమోడీ సొంత అంచనాలు కాగా, మూడోది పూర్తిగా వేరే వ్యక్తి బోరిస్ చెర్నీ చేసిన వ్యాఖ్య. వేర్వేరు సందర్భాల్లో వచ్చిన భిన్న అభిప్రాయాలను కలిపేసి, ఒకే వ్యక్తి ఖాతాలో వేయడం వల్ల సోషల్ మీడియాలో ఇది ఒక సంచలనంగా మారింది. సాంకేతికత వేగంగా మారుతున్న మాట నిజమే అయినా, ఇలాంటి వైరల్ కోట్స్ వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను తెలుసుకోవడం ముఖ్యం.

భారత్ సరిహద్దుపై చైనా-పాక్ కలిసి మరో కుతంత్రం

హైదరాబాద్ పెన్ పవర్: దక్షిణాసియా ప్రాంతంలో వ్యూహాత్మక, భద్రతా సమీకరణాలు అత్యంత వేగంగా మారుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న భద్రతా సవాళ్లు.. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రతి దేశం తన సరిహద్దులను మరింత బలోపేతం చేసుకునే పనిలో పడింది. ఇందులో భాగంగానే భారత్‌కు ఇరువైపులా ఉన్న పొరుగు దేశాలైన చైనా, పాకిస్తాన్‌లు తమ రక్షణ బంధాన్ని మరో స్థాయికి తీసుకెళ్లేందుకు సిద్ధమయ్యాయి. భారత్‌తో ఉన్న సరిహద్దు భద్రతను మరింత కట్టుదిట్టం చేయడానికి, ఆధునీకరించడానికి చైనా అధికారిక సహకారాన్ని విస్తరిస్తున్నట్లు పాకిస్తాన్ ప్రకటించింది. ఇప్పటికే ఆర్థిక, రక్షణ రంగాల్లో అత్యంత సన్నిహిత భాగస్వాములుగా ఉన్న చైనా-పాకిస్తాన్.. ఇప్పుడు సరిహద్దు భద్రత, ఇమ్మిగ్రేషన్ వ్యవస్థలపైనా వ్యూహాత్మక ఉమ్మడి సహకారాన్ని పెంచుతుండటం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఈ కొత్త పరిణామం భారత్‌కు వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన అంశంగా మారింది.

జాయింట్ వర్కింగ్ గ్రూప్‌తో ఉమ్మడి వ్యూహం

చైనా నేషనల్ ఇమ్మిగ్రేషన్ అడ్మినిస్ట్రేషన్ ఉన్నతాధికారుల ఉన్నత స్థాయి బృందం ప్రస్తుతం పాకిస్తాన్‌లో పర్యటిస్తోంది. చైనా విదేశాంగ శాఖ డైరెక్టర్ జనరల్ క్వీ జింగ్యాంగ్ నేతృత్వంలోని ఈ ప్రతినిధి బృందం.. పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహసిన్ నఖ్వీ, సహాయమంత్రి తలాల్ చౌదరిలతో కీలకమైన భేటీలు నిర్వహించింది. ఈ ఉన్నత స్థాయి చర్చల అనంతరం, రెండు దేశాల మధ్య సమన్వయం కోసం ఒక 'జాయింట్ వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు చేయాలని ఇరుపక్షాలు నిర్ణయించాయి. సరిహద్దు ప్రాంతాల్లో అత్యాధునిక సాంకేతికతతో నిఘా వ్యవస్థలను విస్తరించడం... సరిహద్దుల గుండా జరిగే అక్రమ చొరబాట్లను ఇరు దేశాలు ఉమ్మడిగా అడ్డుకోవడం... ఆయుధాల స్మగ్లింగ్, ఉగ్రవాద కార్యకలాపాలు, అంతర్జాతీయ మాదకద్రవ్యాల (డ్రగ్స్) అక్రమ రవాణాను సంయుక్తంగా తిప్పికొట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఇమ్మిగ్రేషన్ వ్యవస్థల ఆధునీకరణ

సరిహద్దు భద్రత మాత్రమే కాకుండా ఇరు దేశాల మధ్య ప్రయాణ ప్రక్రియలను మరింత సులభతరం చేసేందుకు ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను ఆధునీకరించాలని నిర్ణయించారు. సమాచార మార్పిడిని వేగవంతం చేయడం, ఆధునిక సాంకేతికత వినియోగంతో సరిహద్దు నిర్వహణను మరింత సమర్థవంతంగా మార్చేందుకు త్వరలోనే ఒక సమగ్ర ఒప్పందాన్ని ఖరారు చేయనున్నారు.

పాకిస్తాన్‌కు చైనా పూర్తి మద్దతు

"పాకిస్తాన్ మాకు అత్యంత విశ్వసనీయ వ్యూహాత్మక భాగస్వామి. ఆ దేశ సరిహద్దు భద్రతకు అవసరమైన ఆధునిక నిఘా సాంకేతికత, మౌలిక వసతులు, శిక్షణ, సమాచార వ్యవస్థల అభివృద్ధికి చైనా నుంచి పూర్తి సహకారం అందుతుంది" అని చైనా ప్రతినిధులు స్పష్టం చేశారు.

మరోవైపు పాకిస్తాన్ మంత్రి మొహసిన్ నఖ్వీ మాట్లాడుతూ.. చొరబాట్లు, అక్రమ కార్యకలాపాల విషయంలో తమ ప్రభుత్వం "జీరో టాలరెన్స్" విధానాన్ని అనుసరిస్తోందని... చైనాతో భాగస్వామ్యం వల్ల తమ భద్రతా వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.

భారత్‌కు వ్యూహాత్మక సంకేతమా?

భారత్‌తో సుదీర్ఘ సరిహద్దులను పంచుకుంటున్న పాకిస్తాన్, చైనా సహాయంతో సరిహద్దులను ఆధునీకరించడం వెనుక పెద్ద వ్యూహమే దాగి ఉందని రక్షణ రంగ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం దక్షిణాసియా భద్రతా పరిస్థితులపై ముఖ్యంగా భారతదేశ రక్షణ వ్యూహాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

ప్రస్తుతం ఉన్న భారత్-చైనా సరిహద్దు వివాదాలు, అలాగే దశాబ్దాలుగా కొనసాగుతున్న భారత్-పాక్ సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో.. ఈ రెండు దేశాలు కలిసి సరిహద్దులపై కొత్త వ్యూహాలు రచించడం పట్ల భారత రక్షణ శాఖ మరియు వ్యూహాత్మక వర్గాలు తీవ్ర నిఘా ఉంచే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

రియల్ 'ఒకే ఒక్కడు'.. తమిళనాడులో దళపతి మార్క్ మాస్ రూలింగ్!

హైదరాబాద్ పెన్ పవర్: తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తలపతి విజయ్ తనదైన శైలితో అందరినీ ఆశ్చర్యపరుస్తున్నారు. తొలి నుంచి హంగులు, ఆర్భాటాలకు దూరంగా ఉంటూ వస్తున్న విజయ్ గత ముఖ్యమంత్రులకు భిన్నంగా కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారని అభినందనలు అందుకుంటున్నారు. ఇటీవల చెన్నైలోని సైదాపేటలో ఉన్న ఎం.సి. రాజా సోషల్ జస్టిస్ హాస్టల్‌ను ముఖ్యమంత్రి అకస్మాత్తుగా సందర్శించారు. అక్కడి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో ముఖ్యమంత్రి విజయ్ విద్యార్థుల మధ్య జరిగిన సంభాషణ అత్యంత సాధారణంగా కనిపించింది. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

సాధారణ పౌరుడిగా ముఖ్యమంత్రి

ముఖ్యమంత్రి అనే అధికార దర్పానికి దళపతి విజయ్ పూర్తిగా దూరంగా ఉంటున్నారు. ఆయన సీఎంగా బాధ్యతలు తీసుకున్న నుంచి సాధారణంగా ఉండటానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ క్రమంలోనే హడావుడికి దూరంగా, ఎటువంటి ఆర్భాటం లేకుండా హాస్టల్‌లోకి ప్రవేశించిన విజయ్‌ని చూసి అక్కడి విద్యార్థులు మొదట ఆశ్చర్యపోయారు. ఒక ముఖ్యమంత్రి తన స్థాయిని పక్కన పెట్టి, హాస్టల్ గదుల్లోకి వెళ్లి మరీ విద్యార్థులతో మాట్లాడటం చూసి నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో అందుతున్న భోజన నాణ్యత, వార్డెన్ల ప్రవర్తన, అక్కడ ఉన్న వసతులు వంటి అంశాల గురించి విద్యార్థులు ఏమాత్రం భయం లేకుండా ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యంగా, ఒక ముఖ్యమంత్రి తమ సమస్యలను ఓపికగా వింటున్నారన్న విషయాన్ని చూసి విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. కేవలం వినడమే కాకుండా, తదుపరి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇవ్వడం, ప్రభుత్వ వ్యవస్థలలో పారదర్శకతను పెంచేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కొత్త తరం రాజకీయాలు

గత నాలుగు, ఐదు దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల ఆధిపత్యం ఉన్న తమిళ రాజకీయాల్లో, విజయ్ సరికొత్తగా పాలన సాగిస్తున్నారు. ఎన్నికల్లో భారీ విజయం సాధించినప్పటి నుండి ఆయన వ్యవహరిస్తున్న తీరు గమనిస్తే, ఆయన కేవలం 'సినిమా హీరో' మాత్రమే కాదు, 'ప్రజల మనిషి' అని నిరూపించుకుంటున్నారు. గతంలో ఆయన ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం, ఇప్పుడు ఇలా హాస్టల్ విద్యార్థుల కష్టాలను అడిగి తెలుసుకోవడం.. ఇవన్నీ ఆయన క్షేత్రస్థాయి సమస్యలపై ఎంత పట్టు కలిగి ఉన్నారో చెబుతున్నాయి.

రాజకీయాల్లోకి రాకముందే విజయ్‌కి ఉన్న ప్రజాదరణ, ఆయన ఈ రోజు ముఖ్యమంత్రిగా ఆ బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చడానికి ఉపయోగపడుతోందని అంట్న?నారు. సామాన్యుడికి చేరువ కావడమంటే కేవలం ప్రచారానికి పరిమితం కాకుండా, సమస్యల మూలాల్లోకి వెళ్లడం అని విజయ్ నిరూపిస్తున్నారు. అధికార యంత్రాంగంపై నిఘా పెంచడం, అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించడం వంటి పనులతో ఆయన తనదైన ముద్ర వేస్తున్నారు. విజయ్ ప్రారంభించిన ఈ ప్రోయాక్టివ్ గవర్నెన్స్ మరిన్ని కీలక మార్పులకు దారితీస్తుందన్న ఆశను రేకిత్తిస్తోందని అంటున్నారు.

అన్నా.. దయచేసి విశ్రాంతి తీసుకో..! - పవన్ ఆరోగ్యంపై అభిమానుల ఆవేదన

హైదరాబాద్ పెన్ పవర్: ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ నివాసం అభిమానుల తాకిడితో కిటకిటలాడుతోంది. ఇటీవల ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో పవన్ కుడి భుజానికి శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. శస్త్రచికిత్స అనంతరం కోలుకునేందుకు పవన్ కనీసం నాలుగు రోజుల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని సూచించారు. సీఎం చంద్రబాబు సైతం పవన్ ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యల నుంచి కోలుకున్న తర్వాతే పాలన విధుల్లో చేరాలని కోరారు. కానీ, పవన్ ఇంటి వద్ద పరిస్థితి చూస్తే ఇందుకు పూర్తి భిన్నంగా కనిపిస్తోంది. ఆసుపత్రి నుంచి ఇంటికి తిరిగి వచ్చినప్పటి నుండి ఆయనను కలిసేందుకు వస్తున్న నేతల తాకిడితో పవన్ మరింత అలసటకు గురి అవుతున్నారనే ఆవేదన వ్యక్తం అవుతోంది.

పవన్ కళ్యాణ్‌ను పరామర్శించడానికి వస్తున్న నేతల క్యూ చూస్తుంటే, ఇది కేవలం మర్యాదపూర్వకమైన పరామర్శలా లేదని వ్యాఖ్యానిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి దృష్టిలో పడేందుకు నేతలు ఒకరికొకరు పోటీ పడుతున్నట్లు కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పార్టీకి చెందిన ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇంచార్జీలతోపాటు ఇతర రాజకీయ పక్షాలకు చెందిన కీలక నేతలు కూడా ఆయనను కలిసేందుకు ఆసక్తి చూపుతున్నారు. శుక్రవారం ఒక్కరోజే పవన్ సుమారు ఆరు గంటల పాటు నేతలతో సమావేశమై, వారితో మాట్లాడటంలోనే సమయాన్ని గడపాల్సి వచ్చిందని చెబుతున్నారు. అతి మర్యాదస్తుడైన పవన్, వచ్చే వారిని కాదనలేక ఇబ్బందులు పడుతున్నారని పార్టీ వర్గాలే అంగీకరిస్తున్నాయి.

వైద్యుల సూచనకు విరుద్ధం

భుజం సర్జరీ అయిన తర్వాత కుడి చేతికి పూర్తి విశ్రాంతి అవసరం. అయితే, పరామర్శకు వచ్చే వారికి స్వాగతం పలకడం, షేక్ హ్యాండ్లు ఇవ్వడం, బొకేలు అందుకోవడం వంటి పనులతో ఆయన కుడి భుజంపై తీవ్రమైన ఒత్తిడి పడుతోందని అంటున్నారు. ఇలాగే కొనసాగితే గాయం మానడానికి ఆలస్యమవడమే కాకుండా, భవిష్యత్తులో ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితిపై సోషల్ మీడియాలో జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. "పవన్‌కు రాజకీయ సమావేశాలు, పరామర్శల కంటే ఆరోగ్యం ముఖ్యం" అంటూ సూచిస్తున్నారు. అంతేకాకుండా పవన్ కు విశ్రాంతి ఇవ్వండి అని కోరుతూ పోస్టులు చేస్తున్నారు.

సంపాదకీయం

మరింత ఉత్సాహంగా..!

రాష్ట్ర విభజన గాయాలు, రాజధాని లేమి, అప్పుల భారంవంటి ప్రతికూలతల నడుమనుంచి ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల గమ్యస్థానంగా పరుగులు తీస్తోందనడానికి తాజా తార్కాణం –నీతి ఆయోగ్ తొలిసారిగా విడుదల చేసిన 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీనెస్ ఇండెక్స్ 2026'. క్రిసిల్ నాలెడ్జ్ పార్టనర్‌గా రూపొందిన ప్రతిష్ఠాత్మక సూచీలో దేశంలోని 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్రపాలిత ప్రాంతాలను మౌలిక వసతులు, వ్యాపార వాతావరణం, వనరులు, ప్రభుత్వ విధానాలు, నియంత్రణ సౌలభ్యం, ఆర్థిక ఆరోగ్యం, సంస్థాగత వాతావరణం, పర్యావరణ స్థిరత్వం అనే ఎనిమిది పిల్లర్ల ప్రాతిపదికన, 84 సూచికలతో సమగ్రంగా మదింపు చేశారు. 1,850కి పైగా వ్యాపార సంస్థల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం నివేదిక విశ్వసనీయతకు నిలువుటద్దం! ఇందులో ఆంధ్రప్రదేశ్ 48.7 స్కోరుతో దేశవ్యాప్తంగా ఎనిమిదో స్థానం, 17 పెద్ద రాష్ట్రాల విభాగంలో ఆరోస్థానం కైవసం చేసుకుని 'ఫ్రంట్‌రన్నర్' హోదాను సగర్వంగా సాధించింది. గుజరాత్ (56.6), మహారాష్ట్ర (53.7), తమిళనాడు (53.3), ఒడిశా (52.4), మధ్యప్రదేశ్ (48.9) వంటి పారిశ్రామిక దిగ్గజాల సరసన –దశాబ్దకాలంగా పునర్నిర్మాణ దశలో ఉన్న నవ్యాంధ్ర నిలబడటం మామూలు విషయం కాదు. కర్ణాటకవంటి ఐటీ అగ్రగామి రాష్ట్రంతో సమానంగా స్కోరు సాధించడం మరో విశేషం. గతంలో కేంద్ర ప్రభుత్వ 'బిజినెస్ రిఫార్మ్స్ యాక్షన్ ప్లాన్' ర్యాంకింగుల్లో వరుసగా అగ్రస్థానంలో నిలిచిన చరిత్ర ఏపీ సొంతం. మధ్యలో వైకాపా పాలనలో పెట్టుబడుల విశ్వాసం సన్నగిల్లి రాష్ట్రం వెనుకంజలో పడిన మాట వాస్తవం. కూటమి ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టాక 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నినాదంతో సీఎం చంద్రబాబు సాగిస్తున్న పెట్టుబడుల యజ్ఞం –17 నెలల్లోనే 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల కల్పన రూపంలో ఫలించడం మొదలైంది. దావోస్ వేదికగా ప్రపంచ ఆర్థిక సదస్సులో, విశాఖ వేదికగా సీఐఐ భాగస్వామ్య సదస్సులో రాష్ట్రం ఆకర్షించిన అంతర్జాతీయ దృష్టి ఇప్పుడు నీతి ఆయోగ్ గణాంకాల్లో ప్రతిఫలించిందనడంలో అతిశయోక్తి లేదు. ఈ తొలి జాతీయ సూచీలో దక్కిన 'ఫ్రంట్‌రన్నర్' గుర్తింపు –పెట్టుబడిదారుల దృష్టిలో రాష్ట్ర ప్రతిష్ఠను పెంచే విశ్వసనీయ ముద్ర!

నివేదికలో ఏపీ బలాలుగా నిలిచిన అంశాలు రాష్ట్ర భవిష్యత్తుపై భరోసా కల్పించేవే. తలసరి డిజిటల్ లావాదేవీల్లో దాదాపు 18 లావాదేవీలతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. పెద్ద రాష్ట్రాల సగటు 4.8తో పోలిస్తే ఇది దాదాపు నాలుగు రెట్లు! పాలనలో సాంకేతికతను వినియోగించడంలో రాష్ట్రం ఎంత ముందంజలో ఉందో చెప్పడానికి ఈ ఒక్క గణాంకం చాలు. రోజుకు సగటున 23.71 గంటల నిరంతర విద్యుత్ సరఫరా (కేటగిరీ సగటు 22.7 గంటలు), 14 శాతానికే పరిమితమైన ట్రాన్స్‌మిషన్–డిస్ట్రిబ్యూషన్ నష్టాలు (పెద్ద రాష్ట్రాల సగటు 18 శాతం) –పరిశ్రమలకు అత్యంత కీలకమైన ఇంధన రంగంలో ఏపీ సాధించిన నాణ్యతకు నిదర్శనాలు. దేశ నాన్–మెటాలిక్ ఖనిజ ఉత్పత్తి విలువలో దాదాపు పది శాతం వాటా, పునరుత్పాదక ఇంధన సామర్థ్యంలో దేశంలో ఐదోస్థానం రాష్ట్ర సహజ వనరుల పుష్కలతను చాటుతున్నాయి. అన్నింటికన్నా గర్వకారణం –ఉన్నత విద్యలో స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, గణితం) నమోదుల వాటా 48 శాతంతో దేశంలోనే అత్యధికం కావడం. రేపటి పరిశ్రమలకు కావాల్సిన నైపుణ్య మానవ వనరుల గని ఏపీలో సిద్ధంగా ఉందని ఇది ప్రపంచానికి చాటే సందేశం. ఇన్వెస్టర్ల అభిప్రాయ సేకరణలోనూ రాష్ట్రానికి ప్రశంసలే దక్కాయి. విశాఖపట్నం పోర్టు, విస్తరిస్తున్న నౌకాశ్రయాల వల, శ్రీసిటీ, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, ఏపీఐఐసీ పారిశ్రామిక వాడలు, పటిష్ఠమైన కోల్డ్ స్టోరేజీ వసతులను పెట్టుబడిదారులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. వెయ్యి కిలోమీటర్లకు పైబడిన సుదీర్ఘ తీరరేఖ, తలసరి రూ.1.61 లక్షల జీఎస్‌డీపీ, జీవీఏలో 58.6 శాతానికి చేరిన సేవారంగం వాటా –రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిణతి చెందుతున్న తీరుకు సంకేతాలు. ఫుడ్ ప్రాసెసింగ్, రసాయనాలు, ఫార్మా రంగాలను కీలక వృద్ధి చోదకాలుగా నివేదిక గుర్తించడం –ఇప్పటికే ఆ దిశగా డ్రోన్, ఎలక్ట్రానిక్స్, ఏరోస్పేస్, సెమీకండక్టర్, రక్షణ కారిడార్లను అభివృద్ధి చేస్తున్న రాష్ట్ర వ్యూహానికి ఊతమిచ్చేదే. నీతి ఆయోగ్ ప్రత్యేకంగా రూపొందించిన 'ఎనర్జీ ట్రాన్సిషన్ బ్లూప్రింట్' ద్వారా రూ.7.5 లక్షల కోట్ల ఇంధన పెట్టుబడులతో ఏపీని దేశ టాప్–3 పునరుత్పాదక ఇంధన హబ్‌గా తీర్చిదిద్దాలన్న ప్రణాళిక సిద్ధమవుతున్న వేళ –ఈ సూచీ రాష్ట్రానికి రెట్టింపు ఉత్సాహం!

విజయాలను వేడుక చేసుకుంటూనే –అగ్రస్థానానికీ, మనకూ మధ్యనున్న అంతరాన్ని నిజాయతీగా గుర్తించడం వివేకవంతమైన లక్షణం. గుజరాత్ స్కోరు 56.6తో పోలిస్తే ఏపీ 48.7 వద్దే ఉంది. ఈ ఎనిమిది పాయింట్ల వ్యత్యాసాన్ని పూడ్చుకుంటేనే 'ఫ్రంట్‌రన్నర్' నుంచి 'టాప్ పెర్ఫార్మర్' హోదాకు ఎదగగలం. మొత్తం సూచీలో 25 శాతం వెయిటేజీ ఉన్న మౌలిక వసతుల పిల్లర్‌లో ఏపీ మెరుగ్గా ఉన్నా –గుజరాత్ స్థాయి పోర్టు నిర్వహణ సామర్థ్యం, పోటీతత్వంతో కూడిన పారిశ్రామిక విద్యుత్ ధరలను అందుకోవాల్సి ఉంది. 20 శాతం వెయిటేజీ గల వ్యాపార వాతావరణం విభాగంలో మహారాష్ట్ర తరహా ప్రయివేట్ ఈక్విటీ, వెంచర్ క్యాపిటల్ పెట్టుబడుల ప్రవాహాన్ని ఆకర్షించడం, స్టార్టప్ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేయడం రాష్ట్రం ముందున్న తక్షణ కర్తవ్యాలు. తుపానులు, వరదల ముప్పు అధికంగా ఉండే తీర రాష్ట్రంగా పర్యావరణ స్థిరత్వ పిల్లర్‌లో తమిళనాడు అనుసరిస్తున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడం, వాతావరణ మార్పులను తట్టుకునే మౌలిక వసతుల నిర్మాణంపై దృష్టి సారించడం అవసరం. నియంత్రణ సౌలభ్యం, సంస్థాగత వాతావరణంలో ఛత్తీస్‌గఢ్ నుంచి, ప్రభుత్వ విధానాల్లో మధ్యప్రదేశ్ నుంచి నేర్వదగిన పాఠాలున్నాయని నివేదికే సూచిస్తోంది. రాష్ట్రాలు పరస్పరం ఉత్తమ విధానాలను అనుసరించేందుకు ఉద్దేశించిన 'రిఫార్మ్ టూల్'గా ఈ సూచీని నీతి ఆయోగ్ అభివర్ణించిన నేపథ్యంలో –ఏపీ దీన్ని ఆత్మపరిశీలన అద్దంగానే స్వీకరించాలి. 2023–24లో 92.13 మిలియన్ డాలర్లకే పరిమితమైన ఎఫ్‌డీఐలను గణనీయంగా పెంచుకోవడం, ప్రకటిత పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వేగంగా వాస్తవరూపంలోకి తేవడం –ఈ రెండింటిపైనే రాష్ట్ర భవిష్యత్ ర్యాంకు ఆధారపడి ఉంటుంది. స్వర్ణాంధ్ర–47 స్వప్నాన్ని ప్రకటించుకున్న ఏపీ –సూచీలో వెల్లడైన బలాలను పరుగుకు ఇంధనంగా, బలహీనతలను దిద్దుబాటు పాఠాలుగా మలచుకుంటే –వచ్చే నివేదికల్లో 'టాప్ పెర్ఫార్మర్స్' జాబితాలో నిలుస్తుందనడంలో సందేహం లేదు!

పనికొచ్చే పలుకు



భయం దాటాకే.. గెలుపు గడప!

'నువ్వు ఏ పని చేయడానికి భయపడతావో, ఆ పనిని తప్పకుండా చెయ్' –అంటాడు ప్రఖ్యాత అమెరికన్ తత్వవేత్త రాల్ఫ్ వాల్డో ఎమర్సన్. చిన్నమాటగా అనిపించినా.. జీవితాన్ని మలుపు తిప్పే సూక్తి శక్తి ఇది. మనిషి ఎదుగుదలకు అతి పెద్ద అడ్డుగోడ.. అవకాశాల లేమీ కాదు, ప్రతిభ లేమి అంతకంటే కాదు. భయం! వేదిక ఎక్కి మాట్లాడాలంటే భయం! కొత్త ఉద్యోగానికి దరఖాస్తు చేయాలంటే భయం! మనసులోని మాట బయటపెట్టాలంటే భయం! సొంతంగా ఏదైనా ప్రారంభించాలంటే భయం! ఇలా భయం ముసుగులో మనం వదిలేసిన అవకాశాలే.. ఏళ్లు గడిచాక 'అయ్యో, అనే నిట్టూర్పులవుతాయి. ఇక్కడ ఒక సూక్ష్మం గమనించాలి. భయమనేది ప్రమాదాన్ని సూచించే హెచ్చరిక మాత్రమే కాదు.. చాలాసార్లు ఎదుగుదల దిశను చూపించే దిక్సూచి కూడా. మనం దేనికి ఎక్కువగా భయపడతామో.. అక్కడే మన జీవితాన్ని మార్చే తలుపు ఉంటుందన్నది జీవిత సత్యం. స్టేజ్ ఫియర్ ఉన్నవాడు దాన్ని జయిస్తే గొప్ప వక్త కావొచ్చు. రిజెక్షన్ భయాన్ని దాటినవాడు గొప్ప వ్యాపారవేత్త కావొచ్చు. వైఫల్య భయాన్ని అధిగమించినవాడు సాహసికుడిగా చరిత్రకెక్కొచ్చు. అంటే భయం ఉన్న చోటే మన అసలైన సామర్థ్యం నిద్రపోతూ ఉంటుంది. దాన్ని తట్టిలేపాలంటే.. భయపడే పనినే ధైర్యంగా చేయాలి.

లైఫ్‌స్టయిల్ విషయానికొస్తే.. ఈ సూత్రం అద్భుతం. చాలామంది జీవితాలు 'కంఫర్ట్ జోన్' అనే బంగారు పంజరంలో బందీలవుతాయి. అదే ఉద్యోగం, అదే దినచర్య, అదే ఆలోచనలు.. మార్పు అంటే భయం. కానీ పంజరం ఎంత బంగారుదైనా, అది ఎగరడాన్ని ఆపేస్తుంది. రోజూ చిన్న చిన్న భయాలను జయించడం అలవాటు చేసుకుంటే చాలు.. జీవనశైలే మారిపోతుంది. ఉదయాన్నే లేవడానికి బద్ధకిస్తున్నారా? రేపటినుంచి అదే చేయండి. వ్యాయామం కష్టమనిపిస్తోందా? అదే మొదలెట్టండి. కొత్త నైపుణ్యం నేర్చుకోవడం కుదరదనిపిస్తోందా? ఈరోజే తొలి అడుగు వేయండి. ఇలా భయాన్ని, బద్ధకాన్ని ఎదిరించి చేసే ప్రతి చిన్న పనీ.. మెదడులో 'నేను చేయగలను' అనే నమ్మకపు పునాదిని బలపరుస్తుంది. మనస్తత్వ శాస్త్రవేత్తలు దీన్నే 'కాన్ఫిడెన్స్ కాంపౌండింగ్' అంటారు. ఒక భయాన్ని జయిస్తే వచ్చే ఆత్మవిశ్వాసం.. మరో పది భయాలను ఎదుర్కొనే శక్తినిస్తుంది.

అలాగని భయాన్ని పూర్తిగా చంపేయమని కాదు. భయంలేని మనిషి ఉండడు. వీరుడికీ, పిరికివాడికీ తేడా భయం ఉండటంలో కాదు.. భయంతో వ్యవహరించే తీరులో ఉంటుంది. పిరికివాడు భయానికి లొంగి వెనుదిరుగుతాడు. వీరుడు భయాన్ని భుజాన వేసుకునే ముందుకు నడుస్తాడు. ఈత రాని వాడు నీటిని చూసి పారిపోతే జీవితాంతం ఒడ్డునే మిగిలిపోతాడు. దిగి ప్రయత్నిస్తేనే అలలను జయించే కళ సాధిస్తాడు. అభ్యాసంతో భయం చిన్నదవుతుంది.. మనిషి పెద్దవాడవుతాడు. అందుకే ఈరోజే ఒక చిన్న ప్రయోగం చేయండి. మిమ్మల్ని ఎప్పటి నుంచో భయపెడుతున్న ఒక్క పనిని ఎంచుకోండి. అది ఫోన్ చేసి క్షమాపణ చెప్పడం కావొచ్చు.. సభలో చేయెత్తి ప్రశ్న అడగడం కావొచ్చు.. ఎన్నాళ్లుగానో వాయిదా వేస్తున్న ఆరోగ్య పరీక్ష కావొచ్చు. దాన్ని ఈరోజే చేసేయండి. చేసిన మరుక్షణం మీకో అద్భుతం అనుభవంలోకి వస్తుంది.. 'ఇంతేనా? దీనికా ఇన్నాళ్లు భయపడింది?' అనిపిస్తుంది. భయం అనేది దూరం నుంచి చూస్తే పర్వతం.. దగ్గరకెళ్లి తాకితే మంచు ముద్ద. ఎమర్సన్ మాటలోని మర్మమిదే. భయపడే పని చేయడం అంటే ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడం కాదు.. మన లోపలి బలాన్ని బయటకు తీసుకురావడం. భయం గడప దాటిన ప్రతిసారీ.. జీవితం ఒక కొత్త గది తలుపు తెరుస్తుంది!

ఎగుమతులకు కొత్త ఊపు...

భారత వాణిజ్య చరిత్రలో సరికొత్త అధ్యాయానికి తెర లేచింది. మూడేళ్లపాటు పద్నాలుగు విడతల సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం కుదిరిన భారత్–బ్రిటన్ సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సెటా) నాలుగు రోజుల క్రితమే లాంఛనంగా అమల్లోకి వచ్చింది. జీ–7 కూటమిలోని ఒక అగ్రదేశంతో ఇండియా కుదుర్చుకున్న అత్యంత సమగ్ర వాణిజ్య ఒప్పందమిదే. బ్రెగ్జిట్ అనంతరం బ్రిటన్ సంతకం చేసిన అతిపెద్ద ద్వైపాక్షిక ఒడంబడికా ఇదే! 2025 మే 6న చర్చలు కొలిక్కి రాగా.. అదే ఏడాది జులై 24న లండన్ వేదికగా ఉభయ దేశాల ప్రధానుల సమక్షంలో సంతకాలు జరిగాయి. అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో సామాజిక భద్రతకు సంబంధించిన 'డబుల్ కాంట్రిబ్యూషన్ కన్వెన్షన్' (డీసీసీ)పైనా ఇరుపక్షాలు సంతకాలు చేశాయి. ఉభయ దేశాల పార్లమెంటరీ ఆమోదాలు, అంతర్గత ప్రక్రియలు పూర్తయి ఇప్పుడు రెండూ ఏకకాలంలో అమల్లోకి వచ్చాయి. సుంకాల తగ్గింపునకే పరిమితం కాకుండా సేవలు, పెట్టుబడులు, డిజిటల్ వాణిజ్యం, మేధో సంపత్తి హక్కులు, ప్రభుత్వ కొనుగోళ్లు, వృత్తి నిపుణుల రాకపోకల దాకా ముప్పై అధ్యాయాలతో విస్తరించిన ఈ ఒప్పందాన్ని 'బంగారు ప్రమాణ' ఒడంబడికగా వాణిజ్య వర్గాలు అభివర్ణిస్తున్నాయి. దీనికింద భారత ఎగుమతుల్లో దాదాపు 99 శాతం సరకు శ్రేణులకు బ్రిటన్ మార్కెట్లో సుంకరహిత ప్రవేశం లభిస్తుంది. ప్రాసెస్డ్ ఆహారాలపై 70 శాతం దాకా ఉన్న సుంకాలు, సముద్ర ఉత్పత్తులపై 21.5 శాతం, ఇంజినీరింగ్ వస్తువులు–వాహన విడిభాగాలపై 18 శాతం, తోలు–పాదరక్షలపై 16 శాతం, వస్త్రాలపై 12 శాతం సుంకాలు ఒక్క కలం పోటుతో తొలగిపోవడం మన ఎగుమతిదారులకు అపూర్వ అవకాశం. మరోవైపు డీసీసీ చలవతో బ్రిటన్‌లో తాత్కాలిక నియామకాలపై పనిచేసే భారతీయ నిపుణులు ఐదేళ్ల వరకు అక్కడి సామాజిక భద్రత చందాలనుంచి మినహాయింపు పొందుతారు. దీనివల్ల 75 వేలకుపైగా ఉద్యోగులు, తొమ్మిది వందలకు పైచిలుకు కంపెనీలు లబ్ధి పొందుతాయని అంచనా. ప్రస్తుతం సుమారు 56 బిలియన్ డాలర్లుగా ఉన్న ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030నాటికి రెట్టింపు చేసి 112 బిలియన్ డాలర్లకు చేర్చాలన్నది ఉభయ దేశాల సంకల్పం. ఆ లక్ష్యం సాకారం కావాలంటే –తలుపులు తెరిస్తే సరిపోదు; గడప దాటి లోపలికి అడుగుపెట్టే సన్నద్ధత ఉండాలి!

గణాంకాలను పరిశీలిస్తే బ్రిటన్ మార్కెట్లో ఇండియా వాటా ఎంత స్వల్పమో, పెరగాల్సిన అవకాశం ఎంత అపారమో బోధపడుతుంది. గత ఏడాది బ్రిటన్ దాదాపు 92,890 కోట్ల డాలర్ల విలువైన వస్తు దిగుమతులు చేసుకోగా.. అందులో ఇండియా నుంచి వెళ్లినవి 1,520 కోట్ల డాలర్లు. అంటే రెండు శాతంలోపు. రంగాలవారీగా చూసినా ఇదే దుస్థితి. 2025లో బ్రిటన్ 2,130 కోట్ల డాలర్ల విలువైన దుస్తులను వివిధ దేశాల నుంచి తెప్పించుకుంటే, భారత వస్త్రాల వాటా కేవలం 130 కోట్ల డాలర్లు. ప్రపంచానికి 1,630 కోట్ల డాలర్ల దుస్తులను ఎగుమతి చేసే సత్తావున్న భారత్‌కు ఇది ఏమాత్రం సరిపోని అంకె. బంగ్లాదేశ్, వియత్నాంవంటి పోటీదారులు సుంకాల వెసులుబాట్లతో ఇన్నాళ్లూ దండుకున్న మార్కెట్‌ను –'సెటా' పుణ్యమా అని సమాన అవకాశాల వేదికపై ఇప్పుడు మనం అందిపుచ్చుకోవచ్చు. తోలు ఉత్పత్తులు, పాదరక్షల విభాగంలోనూ సుంకాల తొలగింపు మన చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు కొత్త ఊపిరులూదుతుంది. ప్రాసెస్డ్ ఆహార విభాగం మరో బంగారు గని. బ్రిటన్ నిరుడు 3,340 కోట్ల డాలర్ల విలువైన ప్రాసెస్డ్ ఆహారాన్ని దిగుమతి చేసుకోగా అందులో ఇండియా వాటా 35.4 కోట్ల డాలర్లే. రెడీ–టు–ఈట్ వంటకాలు, బేకరీ, మిఠాయిలు, సాస్‌లు, సంప్రదాయ భారతీయ రుచులకు అక్కడి ప్రవాస భారతీయుల్లోనే కాదు, స్థానికుల్లోనూ ఆదరణ పెరుగుతున్న వేళ ఈ విభాగంలో మన వాటాను అనేక రెట్లు పెంచుకోవచ్చు. ధాన్యాలు, కూరగాయలు, పండ్లు, సుగంధద్రవ్యాల దిగుమతుల్లో (2,320 కోట్ల డాలర్లు) ఇండియా వాటా 3.1 శాతమే కావడం, మాంసం–చేపల దిగుమతుల్లో (1,720 కోట్ల డాలర్లు) మన వాటా 12.6 కోట్ల డాలర్లకే పరిమితం కావడం.. వ్యవసాయ, మత్స్యరంగాల్లో మిగిలివున్న విస్తృతావకాశాలకు నిలువుటద్దం! ఇక బ్రిటన్ ఏటా 9,220 కోట్ల డాలర్ల విలువైన వాహనాలు, ద్విచక్ర వాహనాలు, విడిభాగాలను దిగుమతి చేసుకుంటుంటే అందులో భారత్ నుంచి వెళ్లేవి 32.5 కోట్ల డాలర్లే. సుంకాల ఉపశమనంతో ఈ రంగం దీర్ఘకాలంలో మనకు పెద్ద ఆదాయ వనరుగా మారే ఛాన్స్ ఉంది. యంత్రాలు, టెలికాం, కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులకూ ఒప్పందం ఊతమిస్తుంది. అయితే అన్ని రంగాల్లోనూ ఒకే స్థాయి ప్రయోజనం ఉంటుందనుకుంటే పొరపాటే. రసాయనాలు, ఔషధాల్లో ఇండియాకు బలమైన సరఫరా సత్తావున్నా అక్కడ లభించే అదనపు లాభం పరిమితం. వజ్రాలు, బంగారం, వెండి ఉత్పత్తుల దిగుమతుల్లో (17,850 కోట్ల డాలర్లు) లండన్ స్వయంగా అంతర్జాతీయ బులియన్ కేంద్రం కావడంతో అక్కడ నెగ్గుకురావడం సవాలే. ప్లాస్టిక్, రబ్బరు, కాగితం, కొయ్య ఉత్పత్తులు, వంటనూనెల వంటి వాటిలో రవాణా వ్యయాలు, పర్యావరణ నిబంధనలు, తీవ్ర పోటీ కారణంగా ప్రయోజనాలు మధ్యస్థం. ఇనుము–ఉక్కుపై బ్రిటన్ కఠిన కోటాలు, మద్యం–పొగాకుపై ఆంక్షలు కొనసాగుతాయి కాబట్టి ఆ రంగాలనుంచి పెద్దగా ఆశించలేం.

అందుకే 'సెటా' ఫలాలను పూర్తిస్థాయిలో అందుకోవాలంటే ఇండియాకు రంగాలవారీ సమగ్ర ఎగుమతి వ్యూహం అత్యవసరం. సుంకాల తొలగింపు తలుపు తీయడం మాత్రమే –లోపల నిలదొక్కుకోవడానికి పూర్తిగా నాణ్యతా ప్రమాణాలే ఆధారం. ఆహార ఎగుమతిదారులు బ్రిటిష్ శానిటరీ, ఫైటోశానిటరీ నిబంధనలను తు.చ. తప్పకుండా పాటించాలి. ఏ చిన్న లోపం దొర్లినా సరకు మొత్తం తిరస్కరణకు గురై, దేశ ప్రతిష్ఠకూ మచ్చ తెచ్చే ప్రమాదం ఉంటుంది. వాహన ఎగుమతిదారులు 'రూల్స్ ఆఫ్ ఆరిజిన్' నిబంధనలను క్షుణ్నంగా అవగతం చేసుకుని, వస్తూత్పత్తి మూలాన్ని నిర్ధారించే ధ్రువపత్రాల ప్రక్రియలో నైపుణ్యం సాధించాలి. ఒప్పంద ప్రయోజనాల్లో సింహభాగం చిన్న, మధ్యతరహా పరిశ్రమలకే దక్కాల్సి ఉన్నా –వాటికి అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులపై అవగాహన కొరవడటమే పెద్ద అవరోధం. ఎగుమతి ప్రోత్సాహక మండళ్లు, వాణిజ్య శాఖ క్షేత్రస్థాయిలో అవగాహన శిబిరాలు నిర్వహించి, ధ్రువీకరణ ప్రక్రియల్లో చేయూతనందించి, రుణ లభ్యతను సులభతరం చేయాలి. బ్రిటన్ అమలు చేయనున్న కర్బన సర్దుబాటు సుంకాల (సీబీఏఎం) వంటి పర్యావరణ నిబంధనలు భవిష్యత్తులో ఉక్కు, అల్యూమినియం, సిమెంట్ ఎగుమతులకు అడ్డంకిగా మారే ప్రమాదం పొంచి ఉంది కాబట్టి –హరిత ఉత్పత్తి విధానాలవైపు మన పరిశ్రమలు ఇప్పటినుంచే మళ్లాలి. సుంకాలు తగ్గినా సాంకేతిక అవరోధాలు, నాన్–టారిఫ్ నిబంధనల రూపంలో అడ్డుగోడలు మిగిలే ఉంటాయన్న స్పృహతో వ్యవహరించాలి. మరోవైపు బ్రిటన్ వస్తువులకూ భారత మార్కెట్ క్రమంగా తెరుచుకుంటుంది కాబట్టి –స్కాచ్ విస్కీ, విలాసవంత వాహనాల వంటి దిగుమతుల పోటీని తట్టుకునేలా దేశీయ పరిశ్రమలు సామర్థ్యాలను మెరుగుపరచుకోవాలి. ప్రపంచ సరఫరా గొలుసులు పునర్వ్యవస్థీకరణ చెందుతున్న తరుణంలో లభించిన అవకాశాన్ని ప్రభుత్వం, పరిశ్రమలు, ఎగుమతిదారులు త్రికరణశుద్ధిగా అందిపుచ్చుకుంటే –'వికసిత భారత్' స్వప్న సాకారంలో బ్రిటన్ వాణిజ్య వారధి కీలక మజిలీ కాకపోదు! ■



ఏదైనా వస్తువును కొనేటప్పుడు.. 'నా దగ్గర అంత డబ్బు లేదు' అని అనకండి. అది మిమ్మల్ని మానసికంగా బలహీనులను చేస్తుంది. దానికి బదులుగా, ప్రస్తుతానికి ఇది నా బడ్జెట్లో లేదు' అని చెప్పడం అలవాటు చేసుకోండి. మొదటి మాట మీ అసహాయతను చూపిస్తే.. రెండోది మీ ఆర్థిక క్రమశిక్షణను తెలియజేస్తుంది. మాటలు మారిస్తే ఆలోచనలు మారతాయి.. ఆలోచనలు మారితే అలవాట్లు మారతాయి.. అలవాట్లు మారితే ఆర్థిక భవిష్యత్తే మారిపోతుంది. 'లేదు' అనే నిస్సహాయత నుంచి 'ఇప్పుడు కాదు' అనే నియంత్రణ వైపు అడుగేయడమే నిజమైన ఆర్థిక పరిణతి. డబ్బు మీద అదుపు సాధించినవాడే.. జీవితం మీద అధికారం సాధించగలడు!

–మహాదేవ

వింతల్లో వింతలు

వంతెన కింద వాడకట్టు!



ఇళ్ల పైనుంచి వాహనాలు దూసుకుపోతే ఎలా ఉంటుంది? చైనాలోని గుయియాంగ్ నగరవాసులకు ఇది నిత్యానుభవమే! అక్కడి 'షుయికౌసి' వంతెన.. డజనుకు పైగా అపార్ట్‌మెంట్ భవనాల మీదుగా నేరుగా సాగిపోతూ ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తోంది. 1997లో ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యాక.. నగరంలో స్థల కొరత తీవ్రంగా ఉండటంతో అధికారులు వినూత్న ఆలోచన చేశారు. వంతెన కింద ఖాళీగా ఉన్న భూమిలోనే పేదల కోసం అద్దె గృహాలు, పునరావాస భవనాలు నిర్మించారు. నగర నడిబొడ్డుకు దగ్గరగా ఉండటం వీటి ప్రత్యేకత. అయితే పైనుంచి నిరంతరం సాగే ట్రాఫిక్ శబ్దం, ప్రకంపనలు, దుమ్ము ఇక్కడి వేలాది మంది నివాసితులకు దైనందిన జీవితంలో భాగమైపోయాయి. అయినా అద్దె తక్కువ కావడం, సిటీ సెంటర్ అందుబాటులో ఉండటంతో ఎవరూ పెద్దగా ఫిర్యాదు చేయరట! శబ్దాన్ని తగ్గించేందుకు భారీ ట్రక్కులను వంతెనపై నిషేధించారు కూడా. 40 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరంలో స్థలాభావాన్ని అధిగమించిన వినూత్న పట్టణ ప్రణాళికగా దీన్ని నిపుణులు ప్రశంసిస్తున్నారు.

భోజనం చేశాక వేసే యోగాసనం ఇది..

5 నిమిషాలు చేస్తే జీర్ణ సమస్యలు ఉండవు..

భోజనం ముగిసిన కొద్దిసేపటికే పొట్ట బరువుగా అనిపించడం, ఉబ్బరం, అలసట వంటి సమస్యలు చాలామందిని వేధిస్తాయి. ముఖ్యంగా రాత్రి భోజనం తర్వాత ఈ అసౌకర్యం నిద్రపైనా ప్రభావం చూపుతుంది. అలాంటి సమయంలో వెంటనే మందులు తీసుకోవడం లేదా పడుకోవడం కంటే ఒక సులభమైన సహజ మార్గం ఉంది. అదే వజ్రాసనం లేదా థండర్‌బోల్ట్ పోజ్. వజ్రాసనం భోజనం తర్వాత జీర్ణక్రియకు సహాయపడే సులభ యోగా ఆసనమని యోగా నిపుణులు చెబుతున్నారు. వజ్రాసనం ప్రత్యేకత ఏమిటంటే, ఇది భోజనం చేసిన వెంటనే చేయగలిగే అరుదైన యోగా ఆసనాలలో ఒకటి. భారతీయ సంప్రదాయంలో శతాబ్దాలుగా దీన్ని జీర్ణక్రియను మెరుగుపరచడానికి ఉపయోగిస్తున్నారు. పరిశోధనల ప్రకారం యోగా అభ్యాసం చేసే వ్యక్తులు ఆరోగ్యకరమైన ఆహారం, శారీరక చలనం, జీవనశైలి అలవాట్లను అనుసరిస్తారు.

రక్త ప్రసరణ మెరుగ్గా..

ఈ ఆసనం చేయడం వల్ల శరీరంలో జీర్ణక్రియ అవయవాలకు రక్తప్రసరణ మెరుగుపడుతుంది. దీని వలన ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అలాగే ఉబ్బరం, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యలు తగ్గుతాయి. అంతేకాకుండా వెన్ను కండరాలు బలపడటానికి ఇది సహాయపడుతుంది. కొంతవరకు సయాటికా నొప్పి తగ్గించడంలో కూడా ఉపశమనం ఇస్తుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. టైప్-2 డయాబెటిస్ లక్షణాల నియంత్రణలో కూడా ఇది కొంత ఉపయోగకరమని పరిశోధనలు చెబుతున్నాయి. వజ్రాసనం చేయడం చాలా సులభం. ముందుగా నేలపై మోకాళ్లపై కూర్చోవాలి. మోకాళ్లు కలిపి ఉంచి, పాదాలపై పిరుదులను వుంచాలి. వెన్నుని నిటారుగా ఉంచి, భుజాలను రిలాక్స్ చేయాలి. చేతులను తొడలపై ఉంచి, కళ్లను మూసుకుని నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. భోజనం తర్వాత 5 నుంచి 10 నిమిషాల పాటు ఈ ఆసనంలో ఉండటం మంచిది. కొత్తవారు మొదట 2-3 నిమిషాల నుంచి ప్రారంభించి, క్రమంగా సమయాన్ని పెంచుకోవచ్చు.

వీరు వేయకూడదు..

ఈ ఆసనం చేసిన కొద్దిసేపటికే పొట్ట తేలికగా అనిపించడం మొదలవుతుంది. దీన్ని రోజువారీ అలవాటుగా మార్చుకుంటే జీర్ణక్రియ మెరుగుపడటమే కాకుండా, ఆమ్లత్వం, అజీర్ణ సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే ఇది మనసుకు ప్రశాంతతను కూడా ఇస్తుంది. అయితే తీవ్రమైన మోకాళ్ల నొప్పి, కాళ్ల గాయాలు లేదా కీళ్ల సమస్యలు ఉన్నవారు ఈ ఆసనం వేయకూడదు. అవసరమైతే కాళ్ల మధ్య కుషన్ ఉపయోగించడం ద్వారా సౌకర్యంగా చేసుకోవచ్చు. దీన్ని దీర్ఘకాలిక జీర్ణ సమస్యలకు ప్రత్యామ్నాయంగా భావించకూడదు. తరచూ ఇబ్బందులు ఎదురైతే వైద్యులను సంప్రదించడం అవసరం. ఇక వజ్రాసనం అసలు ప్రయోజనం దీన్ని క్రమం తప్పకుండా వేయడంలోనే ఉంది. భోజనం తర్వాత వెంటనే పడుకోవడం లేదా మొబైల్ వాడటం కంటే, కొన్ని నిమిషాలు వజ్రాసనంలో కూర్చోవడం ద్వారా ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. చిన్న అలవాటు అయినా, పెద్ద మార్పును తీసుకువస్తుందని నిపుణులు సూచిస్తున్నారు.

బరువు తగ్గాలంటే ఈ సూచనలను పాటించడం తప్పనిసరి.. లేదంటే సమస్య పరిష్కారం కాదు..

మారిన జీవన విధానం కారణంగా తలెత్తే సమస్యల్లో మొదటిది అధిక బరువు. ఈ సమస్యతో చాలా మంది బాధ పడుతున్నారు. అధిక బరువు కారణంగా అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఆరోగ్యం మీద స్పృహ రావడంతో చాలా మంది బరువు తగ్గడానికి ప్రయత్నిస్తున్నారు. బరువు తగ్గాలని అనుకోగానే ముందుగా చాలా మంది ఆహారాన్ని కట్టడి చేయడం ప్రారంభిస్తారు. కార్బొహైడ్రేట్లు మానేయడం, ఇష్టమైన వంటకాలను దూరం పెట్టడం, కఠినమైన డైట్‌లు పాటించడం వంటివి అందరిలో సాధారణంగా కనిపిస్తాయి. అయితే ఈ నమ్మకాలలో చాలా వరకు నిజం కాదని ఫిట్‌నెస్ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. బరువు తగ్గాలంటే ఫాస్ట్ ఫుడ్ పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. సరైన క్యాలరీలను తీసుకుంటూ, తగినంత ప్రోటీన్ అందుకుంటే అప్పుడప్పుడు బర్గర్లు లేదా ర్యాప్స్ తిన్నా బరువు తగ్గడంలో పెద్ద సమస్య ఉండదని వారు చెబుతున్నారు.

అసలు సమస్య అదే..

మీల్ ప్రెప్ అనే అలవాటు అందరికీ అవసరం కాదు. ముందుగానే వండిన ఆహారం చాలా సందర్భాల్లో వృథా అయ్యే అవకాశం ఉంటుంది. అందుకే సులభంగా, త్వరగా తయారు చేసుకునే ఆహారాలను ఎంపిక చేసుకోవడం మంచిదని వారు సూచిస్తున్నారు. అంతేకాకుండా ఉదయం అల్పాహారం విషయంలో కూడా జాగ్రత్త అవసరమని, ప్రోటీన్ ఎక్కువగా ఉండే బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటే రోజంతా ఆకలి నియంత్రణలో ఉంటుందని, తక్కువ ప్రోటీన్ ఉన్న ఆహారం తీసుకుంటే త్వరగా ఆకలి వేస్తుందని నిపుణులు తెలియజేస్తున్నారు. అలాగే కార్బొహైడ్రేట్లను పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. బియ్యం, రొట్టె, ఆలుగడ్డలు వంటి ఆహారాలు సమస్య కాదు. అసలు సమస్య ఎక్కువగా తినడమేనని వారు చెబుతున్నారు. ఇంట్లో వండిన ఆహారం మాత్రమే ఆరోగ్యకరం అనే భావన పూర్తిగా నిజం కాదని, బయట తిన్నా, ఇంట్లో తిన్నా ప్రోటీన్, క్యాలరీలు ఒకే విధంగా పనిచేస్తాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

అన్ని రకాల వ్యాయామాలు అవసరం..

ఇక వ్యాయామంలో కార్డియోకే ప్రాధాన్యం ఇవ్వడం సరైన విధానం కాదు. శక్తి వ్యాయామాలు (strength training) కూడా చాలా ముఖ్యమైనవి. మొదట వెయిట్ లిఫ్టింగ్ చేసి, తరువాత వాకింగ్ చేయడం మంచిది. సప్లిమెంట్స్ ఎక్కువగా అవసరం ఉండవు. సాధారణ ఆహారంతోనే ఎక్కువ పోషకాలు పొందవచ్చు. జిమ్‌లో ఎక్కువ సమయం గడిపితేనే ఫలితాలు వస్తాయని అనుకోవడం తప్పు. క్రమంగా, నిరంతరంగా చేయడం (consistency) ముఖ్యమైనదని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే బరువు కొలిచే త్రాసుపై చాలా మంది ఎక్కువగా ఆధారపడుతూ ఉంటారు. రోజువారీ బరువు మార్పులు సహజం. అయితే దానిని కొవ్వు పెరిగిందని అర్థం చేసుకోకూడదని వారు చెబుతున్నారు. బరువు తగ్గాలనుకునే వారు సంకల్పబలం (willpower) మీద మాత్రమే ఆధారపడకుండా, సులభమైన ఆహార ప్రణాళికలు అలవాటు చేసుకోవాలని, ఆహారాన్ని కఠినంగా నియంత్రించడం కంటే, దానిని సరిగ్గా అర్థం చేసుకుని సమతుల్యంగా తీసుకోవడం ద్వారా బరువు తగ్గడం సులభం అవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

అధిక వేడి తగిలేలా తేనెను ఉపయోగిస్తున్నారా.. అయితే ఇది తెలుసుకోండి..

తేనె ఆరోగ్యానికి మంచిదనే భావన చాలా మందిలో ఉంది. సహజమైన మధుర పదార్థంగా చక్కెరకు ప్రత్యామ్నాయంగా దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అయితే తేనెను ఎలా ఉపయోగిస్తామన్నదే దాని ప్రయోజనాలను నిర్ణయిస్తుందని పోషకాహార నిపుణులు స్పష్టం చేస్తున్నారు. తేనె సాధారణంగా సురక్షితమైన ఆహార పదార్థమే. శతాబ్దాలుగా దీన్ని ఆహారంలో భాగంగా ఉపయోగిస్తున్నారు. కానీ దీనిని వేడి చేసే విధానం, నిల్వ చేసే విధానం వంటి అంశాలు దాని పోషక విలువలపై ప్రభావం చూపుతాయని నిపుణులు చెబుతున్నారు.

అధిక వేడికి గురికావద్దు..

తేనెను మోస్తరు ఉష్ణోగ్రత వద్ద వాడడం పెద్ద సమస్య కాదు. సాధారణ వంటకాలలో లేదా గోరువెచ్చని పదార్థాల్లో కలిపితే హానికరం కాదు. కానీ అధిక ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తే సమస్యలు మొదలవుతాయి.

అధిక వేడి వల్ల తేనెలో ఉండే సహజ ఎంజైమ్స్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు క్రమంగా నశించిపోతాయి. సుమారు 40 డిగ్రీల సెల్సియస్‌కి పైగా ఉష్ణోగ్రతలకు తేనెను గురి చేస్తే థర్మల్ డీగ్రడేషన్ అనే ప్రక్రియ ప్రారంభమవుతుందని నిపుణులు చెబుతున్నారు. అంటే తేనె నిర్మాణం మారి, దాని గుణాత్మక విలువ తగ్గిపోతుంది. ఫలితంగా రుచి, వాసన, రంగు కూడా మారే అవకాశం ఉంటుంది.

సరిగ్గా ఉపయోగించాలి..

అందువల్ల తేనెను సరిగ్గా ఉపయోగించడం అలవాటు చేసుకోవాలి. తేనెను సరిగ్గా వాడడానికి కొన్ని సులభమైన సూచనలను కూడా నిపుణులు తెలియజేస్తున్నారు. మరిగిన నీటిలో కాకుండా గోరువెచ్చని నీటిలో తేనె కలపడం మంచిది. వంట పూర్తయ్యాక ఆహారంపై తేనెను జోడించడం ఉత్తమం. అలాగే తేనెను మళ్లీ మళ్లీ వేడి చేయడం నివారించాలి. వంటలో ప్రధాన పదార్థంగా కాకుండా చివర్లో జోడించే పదార్థంగా వాడితే దాని ప్రయోజనాలు మెరుగ్గా లభిస్తాయి. తేనె హానికరం కాదు. కానీ దాన్ని ఎలా వాడుతున్నామన్నదే కీలకం. సరైన విధంగా ఉపయోగిస్తేనే దాని సహజ ప్రయోజనాలను పూర్తిగా పొందగలమని నిపుణులు సూచిస్తున్నారు.

పురుషుల్లో ఎల్లప్పుడూ అలసట, నీరసం ఉంటే.. వాటి అర్థం ఏమిటి.. ఏం చేయాలి..?

పురుషుల ఆరోగ్యం అంటే చాలామంది జిమ్, ప్రోటీన్ డైట్, ఫిట్‌నెస్ లక్ష్యాలకే పరిమితం చేస్తారు. కానీ నిజమైన ఆరోగ్యం చిన్న చిన్న లక్షణాల్లోనే దాగి ఉంటుంది. అలసట, ఒత్తిడి, జీర్ణ సమస్యలు వంటి విషయాలను సాధారణమే అని వదిలేయడం వల్ల భవిష్యత్తులో పెద్ద సమస్యలు వస్తాయి. అందుకే ఎక్కువగా మాట్లాడని కొన్ని ముఖ్య ఆరోగ్య సమస్యలపై దృష్టి పెట్టడం అవసరమని నిపుణులు చెబుతున్నారు. పురుషులు నిర్లక్ష్యం చేయకూడని ఆరోగ్య సమస్యల గురించి వైద్యులు వివరిస్తున్నారు. రోజంతా పని చేసిన తర్వాత అలసట అనిపించడం సహజం. కానీ ఎప్పుడూ అలసిపోయినట్టే అనిపిస్తే అది సాధారణం కాదు. చాలా మంది పురుషులు దీనిని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. ఇది పోషకాహార లోపం, థైరాయిడ్ సమస్యలు, ఒత్తిడి లేదా మెటబాలిక్ సమస్యలకు సంకేతం అవుతుంది. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే అసలు కారణం గుర్తించడంలో ఆలస్యం అవుతుంది.

ఒత్తిడి, కోపం, ఒంటరితనం..

అలాగే యువకుల్లో కనిపించే గుండె సమస్యలను కూడా తక్కువగా తీసుకోకూడదు. గుండె జబ్బులు వృద్ధులకు మాత్రమే వస్తాయని భావించడం తప్పు. ఇప్పుడు 30-40 ఏళ్ల పురుషుల్లో కూడా హై బీపీ, కొలెస్ట్రాల్, పొగ త్రాగడం, ఒత్తిడి వంటి కారణాలతో గుండె సమస్యలు పెరుగుతున్నాయి. ఇవి ప్రారంభంలో లక్షణాలు చూపకపోవడం వల్ల ప్రమాదం ఎక్కువగా ఉంటోంది. అలాగే ఒత్తిడి -- కోపం వంటివి ఒంటరితనానికి తోడై పురుషులను కుంగదీస్తుంటాయి. పురుషులు తమ భావాలను తక్కువగా బయటపెడతారు. అందువల్ల ఒత్తిడి, ఎక్కువగా కోపం, చిరాకు లేదా ఒంటరిగా ఉండాలనే భావనగా కనిపిస్తుంది. ఇది వ్యక్తిగత జీవితం, ఉద్యోగంపై ప్రభావం చూపుతుంది. ఈ మార్పులను గుర్తించడం చాలా ముఖ్యమని నిపుణులు సూచిస్తున్నారు.

నిద్రలేమి..

అంతేకాకుండా నిద్ర లోపం కూడా రోజు వారి జీవితంపై ప్రభావం చూపిస్తుంది. చాలా మంది దీనిని అస్సలు పట్టించుకోరు. కానీ తక్కువ నిద్ర లేదా నాణ్యమైన నిద్ర లేకపోవడం అనేక సమస్యలకు కారణం అవుతుంది. గురక, తరచూ మేల్కొనడం, రోజంతా నిద్రమత్తుగా ఉండటం వంటి లక్షణాలు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. సరైన నిద్ర లేకపోతే బరువు పెరగడం, రోగ నిరోధక శక్తి తగ్గడం, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం పెరగడం జరుగు తుంది. జీర్ణ సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. ఉబ్బరం, ఆమ్లత్వం, అజీర్ణం వంటి సమస్యలను చాలామంది చిన్న విషయం గా తీసుకుంటారు. కానీ ఇవి తరచుగా వస్తే జీర్ణ వ్యవస్థ లేదా ఆహారపు అలవాట్లలో సమస్యలు ఉన్నాయనే సూచనగా భావించా లి. సరైన ఆహారం, నీరు, సమయానికి భోజనం తీసుకోవడం చేయాలి.

వెంటనే అప్రమత్తం అవ్వాలి..

అదే విధంగా చాలా మంది పురుషులు మెల్లగా బరువు పెరుగుతూ ఉంటారు. వారి బరువు ఒక్కసారిగా పెరగదు. క్రమంగా పెరుగుతుంది. వ్యాయామం లేకపోవడం, తప్పు ఆహారం, ఒత్తిడి కారణంగా ఇది జరుగుతుంది. దీని వల్ల డయాబెటిస్, గుండె జబ్బులు, కీళ్ల సమస్యలు వచ్చే ప్రమాదం ఉంటుంది. తొందరగా మార్పులు చేసుకోవడం మంచిది. అలాగే చాలామంది సమస్యలు తీవ్రమైనప్పుడు మాత్రమే డాక్టర్‌ను సంప్రదిస్తారు. ఇది ప్రమాదకరం. రెగ్యులర్ చెకప్‌లు చేయించుకుంటే ముందుగానే సమస్యలను గుర్తించవచ్చు. రక్తంలో చక్కెర, కొలెస్ట్రాల్, బీపీ వంటి పరీక్షలు చాలా అవసరం. పురుషుల ఆరోగ్యం అంటే కేవలం బలంగా ఉండడమే కాదు. చిన్న లక్షణాలను కూడా పట్టించుకోవడం, సమయానికి పరీక్షలు చేయించుకోవడం, జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

‘బాధపడడం ఎందుకు?’.. రోహిత్ రిటైర్మెంట్ ప్రచారంపై కపిల్ దేవ్

రోహిత్ రిటైర్మెంట్‌పై జోరు ప్రచారం

దీనిపై స్పందించిన కపిల్ దేవ్

ఏదో ఒకరోజు వీడ్కోలు చెప్పక తప్పదని వ్యాఖ్య

ఇన్నేళ్లు రోహిత్ ఎంతో ఆనందం పంచాడని వెల్లడి

అతడి రిటైర్మెంట్‌ను సెలబ్రేట్ చేసుకోవాలని సూచన

బాధపడాల్సిన అవసరం లేదని హితవు

హైదరాబాద్ పెన్ పవర్: టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రచారంపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించాడు. రోహిత్ క్రికెట్‌కు వీడ్కోలు పలికే రోజు ఎప్పుడొచ్చినా అది బాధపడాల్సిన సందర్భం కాదని, సంబరాలు చేసుకోవాల్సిన క్షణమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే రోహిత్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావొచ్చన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించాడు. “బాధ ఎందుకు? ఇన్నేళ్లుగా రోహిత్ మనందరికీ ఎంతో ఆనందం పంచాడు. ఏదో ఒకరోజు అందరూ క్రికెట్‌ను వీడాల్సిందే. సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, సచిన్ టెండూల్కర్ ఇలా అందరూ వీడారు. అలాగే రోహిత్ కూడా ఒకరోజు తప్పకుండా వీడ్కోలు చెబుతాడు” అని కపిల్ దేవ్ అన్నాడు. రోహిత్ వెళ్లే రోజు అతడి కెరీర్‌ను గర్వంగా గుర్తుచేసుకోవాలని కపిల్ సూచించాడు. “దేశానికే కాదు, ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు అతడు ఎన్నో అద్భుతమైన క్షణాలు అందించాడు. అలాంటి ఆటగాడి ప్రయాణాన్ని బాధగా కాకుండా సెలబ్రేట్ చేసుకోవాలి” అని పేర్కొన్నాడు. అంతేకాదు, రోహిత్ రిటైర్ అయితే సెంచరీతో చిరస్మరణీయంగా వీడ్కోలు పలకాలని ఆకాంక్షించాడు. “ఏదో ఒకరోజు వెళ్లాల్సిందే. కానీ వెళ్లే ముందు శతకం బాది వెళ్లాలని కోరుకుంటున్నా” అని చెప్పాడు. 2007లో ఐర్లాండ్‌పై వన్డే అరంగేట్రం చేసిన రోహిత్ ఇప్పటికే టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో వరుసగా 11, 26 పరుగులకే పరిమితమవడంతో రిటైర్మెంట్ ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు ఎనిమిది వన్డేల్లో 241 పరుగులు చేసిన రోహిత్ సగటు 30.12గా ఉంది. ప్రస్తుతం లార్డ్స్ వేదికగా జరగనున్న నిర్ణయాత్మక మూడో వన్డేపై అందరి దృష్టి నెలకొంది.

మెస్సీకి గోల్డెన్ ఛాన్స్.. ఫైనల్‌లో బద్దలు కొట్టే 5 రికార్డులివే!



హైదరాబాద్ పెన్ పవర్: ఆదివారం న్యూజెర్సీ స్టేడియంలో స్పెయిన్‌తో జరగబోయే ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్ లో అర్జెంటీనా లెజెండ్ లియోనెల్ మెస్సీ కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ అయ్యే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం 39 ఏళ్ల వయసున్న మెస్సీ.. 43 ఏళ్ల వయసులో 2030లో మరో వరల్డ్ కప్ ఆడటం చాలా కష్టమే కాబట్టి, ఈ మ్యాచ్‌తోనే అతడు తన అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలని భావిస్తున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటికే 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో అద్భుత ఫామ్‌లో ఉన్న గోట్ మెస్సీ, ఈ ఫైనల్ మ్యాచ్ లో ఫుట్‌బాల్ చరిత్రలోని పలు ఆల్‌టైమ్ రికార్డులను బద్దలు కొట్టేందుకు సిద్ధమయ్యాడు. ఆ రికార్డుల గురించి ఇప్పుడు ఎ6 వెలుగు వెబ్ సైట్ లో తెలుసుకుందాం..

ఆదివారం మైదానంలోకి అడుగు పెట్టగానే ప్రపంచకప్ ఫైనల్ ఆడిన అత్యంత వృద్ధ అవుట్‌ఫీల్డ్ (గోల్‌కీపర్ కాకుండా) ఆటగాడిగా మెస్సీ రికార్డు సృష్టిస్తాడు.

సరికొత్త సవరణ: ఇక్కడ ఒక చిన్న ఆసక్తికరమైన విషయం గమనించాలి. ఒరిజినల్ నోట్స్‌లో మెస్సీ వయసును పొరపాటున “29 ఏళ్లు” అని పేర్కొన్నారు, కానీ ప్రస్తుతం 2026 జూలై నాటికి మెస్సీ అసలు వయసు 39 ఏళ్ల 25 రోజులు.

1982 ఫైనల్లో ఇటలీ గోల్‌కీపర్ డినో జోఫ్ 40 ఏళ్ల వయసులో ఆడి ఓవరాల్‌గా రికార్డు సృష్టించగా, అవుట్‌ఫీల్డర్లలో మెస్సీదే అగ్రస్థానం కానుంది. అంతేకాదు, ఈ మ్యాచ్‌లో మెస్సీ గనుక ఒక గోల్ చేస్తే.. ఫైనల్లో గోల్ చేసిన అత్యంత వృద్ధ ఆటగాడిగా నిలుస్తాడు. తద్వారా 1958లో 35 ఏళ్ల వయసులో గోల్ చేసిన స్వీడన్ ప్లేయర్ నిల్స్ లీడ్‌హోమ్ రికార్డును అధిగమిస్తాడు.

మూడు ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన సెకండ్ ప్లేయర్:

మెస్సీ కెరీర్‌లో ఇది మూడో ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ కానుంది. గతంలో ఆయన 2014 (జర్మనీతో ఓటమి), 2022 (ఫ్రాన్స్‌పై విజయం) ఫైనల్స్ ఆడాడు. ఫుట్‌బాల్ చరిత్రలో 3 ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన రెండో ఆటగాడిగా బ్రెజిల్ దిగ్గజం కాఫు (ఝుటబ – 1994, 1998, 2002) సరసన లియోనల్ మెస్సీ నిలుస్తాడు.

కెప్టెన్‌గా రెండు వరల్డ్ కప్‌లు గెలిచిన తొలి ఆటగాడు:

ఫుట్‌బాల్ చరిత్రలో ముందెన్నడూ ఏ కెప్టెన్ కూడా తన జట్టుకు రెండుసార్లు ప్రపంచకప్ టైటిల్ ని ఇప్పటి వరకు అందించలేదు. ఆదివారం అర్జెంటీనా గెలిస్తే, రెండుసార్లు కెప్టెన్‌గా ట్రోఫీని ముద్దాడిన ప్రపంచంలోనే ఏకైక ప్లేయర్ గా మెస్సీ చరిత్ర సృష్టించనున్నాడు.

ఒకే ఎడిషన్‌లో అటాకింగ్ కాంట్రిబ్యూషన్స్:

ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో మెస్సీ 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో మొత్తం 12 గోల్ కాంట్రిబ్యూషన్స్ (భాగస్వామ్యాలు) అందించాడు. 1970లో పశ్చిమ జర్మనీకి చెందిన గెర్డ్ ముల్లర్ సాధించిన 13 గోల్స్–అసిస్ట్‌ల రికార్డును అధిగమించడానికి మెస్సీకి మరో రెండు పాయింట్లు (గోల్ లేదా అసిస్ట్) మాత్రమే అవసరం. ఒక గోల్ సాధిస్తే ముల్లర్ రికార్డును ఈక్వల్ చేస్తాడు. రెండు సాధిస్తే వరల్డ్ రికార్డ్ బ్రేక్ అవుతుంది.

అరుదైన రికార్డులు:

రెండు వేర్వేరు ఫైనల్స్‌లో గోల్స్: స్పెయిన్‌పై లియోనల్ మెస్సీ గోల్ చేస్తే.. రెండు వేర్వేరు ప్రపంచకప్ ఫైనల్స్‌లో గోల్స్ చేసిన 6వ ఆటగాడిగా నిలవనున్నాడు, పెలే, పాల్ బ్రెయిట్నర్, జినెదిన్ జిదాన్, కిలియన్ ఎంబాప్పేల సరసన చేరనున్నాడు.

వరల్డ్ కప్ ఫైనల్స్ మోస్ట్ గోల్స్: 2022 ఫైనల్లో మెస్సీ రెండు గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్‌లోనూ రెండు గోల్స్ (దీఝుఎవ) చేస్తే, ప్రపంచకప్ ఫైనల్స్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఎంబాప్పే రికార్డును సమం చేస్తాడు.

ఫ్రీ–కిక్ రికార్డు: ఒకవేళ మెస్సీ ఫ్రీ–కిక్ ద్వారా గోల్ సాధిస్తే, ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక ఫ్రీ–కిక్ గోల్స్ చేసిన ప్లేయర్స్ జాబితాలో అగ్రస్థానానికి చేరుకోనున్నాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 2 ఫ్రీ–కిక్ గోల్స్ మాత్రమే ఉన్నాయి.

అర్జెంటీనా జం స్పెయిన్ మధ్య ఫైనల్ ఫైట్.. ఎవరు గెలిస్తే భారత్‌కు లాభమో తెలుసా?

హైదరాబాద్ పెన్ పవర్: ప్రంవచవ్యాప్తంగా కోట్ల మంది ఫుట్‌బాల్ ఫ్యాన్స్ (ఆదివారం, జూలై 19న) జరగబోయే ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక మెగా సమరంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వర్సెస్ స్పెయిన్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ప్రాణాలు పెట్టి ఆడి, హేమాహేమీ జట్లను మట్టికరిపించి ఈ రెండు టీమ్స్ తుది పోరుకు సిద్ధమయ్యాయి. మన దేశంలో ఫుట్‌బాల్‌కు అంతగా ఆదరణ లేకపోయినా, ఈ ఫైనల్ మ్యాచ్‌పై భారత క్రికెట్ ఫ్యాన్స్ కూడా ప్రత్యేకమైన ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. దీని వెనుక ఒక ఆసక్తికరమైన క్రికెట్ సెంటిమెంట్ దాగి ఉండటమే దీనికి ప్రధాన కారణం.

2010లో స్పెయిన్ గెలుపు.. 2011లో భారత్ మ్యాజిక్:

భారత క్రికెట్ ప్రేమికులు ఎప్పటికీ మర్చిపోలేని మధురమైన ఏడాది 2011. మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో భారత జట్టు వన్డే వరల్డ్ కప్ గెలిచి, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ చిరకాల కోరికను నెరవేర్చిన ఏడాది అది.. కానీ దీనికి సరిగ్గా ఒక ఏడాది ముందు, అంటే 2010లో స్పెయిన్ జట్టు ఫిఫా వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. స్పెయిన్ ఫుట్‌బాల్ కప్ కొట్టిన తర్వాత ఏడాదే టీమిండియా క్రికెట్‌లో వరల్డ్ కప్ గెలిచాం.. కాబట్టి, ఈ సెంటిమెంట్‌కు బలమైన పునాది వేసింది.

2022 అర్జెంటీనా విజయం..– 2023లో గుండెకోత:

ఇక ఈ సెంటిమెంట్‌ను ఫ్యాన్స్ మరింత బలంగా నమ్మడానికి మరో కారణం కూడా ఉంది. అదేనండి

బాబోయ్ 2023 వరల్డ్ కప్ ఫలితం.. లియోనల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు 2022లో ఫిఫా వరల్డ్ కప్ గెలిచింది. కానీ, ఆ మరుసటి ఏడాది జరిగిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ సారథ్యంలోని ఇండియన్ టీమ్ అద్భుతంగా ఆడి ఫైనల్ కి వెళ్లింది. కానీ దురదృష్టవశాత్తూ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఘోరంగా ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. అర్జెంటీనా గెలిచిన తర్వాత ఏడాది భారత్‌కు నిరాశే ఎదురవడంతో ఫ్యాన్స్ ఈ లాజిక్‌ను నమ్ముతున్నారు.

2026 ఫైనల్ ఫలితం.. 2027 వన్డే వరల్డ్ కప్ ఇండియాదేనా:

ప్రస్తుతం 2026లో జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ ఫలితంపైనే భారత్ 2027 వన్డే వరల్డ్ కప్ భవిష్యత్తు ఆధారపడి ఉందని క్రికెట్ ఫ్యాన్స్ లెక్కలేసుకుంటున్నారు. ఒకవేళ ఈసారి అర్జెంటీనా గెలిస్తే, భారత్ 2027 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ వరకు వెళ్లి మళ్లీ ఓడిపోతుందని టెన్షన్ పడుతున్నారు. అదే స్పెయిన్ కానీ గెలిస్తే మాత్రం 2027 వన్డే ప్రపంచ కప్ ఖచ్చితంగా మనమే గెలుస్తామని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ఈ ముచ్చట వినడానికి చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ, స్పోర్ట్స్‌లో సెంటిమెంట్స్‌కు ఉండే క్రేజ్ వేరబ్బా..

బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న ‘సామజవరగమన’ బ్యూటీ

దక్షిణాది చిత్రసీమలో దూసుకుపోతున్న యషికా ఆనంద్, ఎరుపు రంగు గ్లామరస్ లుక్‌లో మెరిసిపోతోంది.

తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన’ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని పుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.

పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు:

మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

బీచ్ లో రెడ్ డ్రెస్ హంగామా – ప్రెగ్నెన్సీ గ్లో:

ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా పుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. “ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం” అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

సమయం ఎంత వేగంగా గడిచిపోయింది:

తన బేబీ బంప్ ఫోటోలను షేర్ చేస్తూ రెబా మోనికా జాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. “సమయం ఇంత వేగంగా ఎలా గడిచిపోయింది? బేబీ బంప్‌తో గడిపే చివరి కొన్ని రోజులు ఇవి” అంటూ ఆమె ఎమోషనల్ అయ్యింది. ఇక త్వరలోనే మాతృత్వపు తీపి అనుభూతిని పొందబోతున్న తరుణంలో ఆమె ముఖంలోని ఆనందం ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. రెబా షేర్ చేసిన ఈ బ్యూటిఫుల్ ఫోటోలు చూసి ఫ్యాన్స్, సెలబ్రిటీలు ఆమెకు పెద్ద ఎత్తున కంగ్రాట్స్ చెప్తున్నారు. ఈ ప్రెగ్నెన్సీ సమయంలో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులు కామెంట్ల సెక్షన్‌లో ప్రేమను కురిపిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో రాచరికపు అందాన్ని వలకబోసే ఈ సామజవరగమన బ్యూటీ, ఇప్పుడు ప్రెగ్నెన్సీ లుక్‌లోనూ అంతే స్టైలిష్‌గా మరియు క్యూట్‌గా కనిపిస్తూ అందరి హృదయాలను గెలుచుకుంటోంది.

యోధురాలి తరహా బంగారు వర్ణపు వేషధారణలో జియోర్జియా ఆండ్రియాని మెరుపులు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965